ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
5
గురువారం 16 జనవరి 2025



పెదకూరపాడు: ముస్సాపురంలో కోడి పందేలు

కోడి రూ. కోట్లు

- ఆపేదెవరన్నట్లుగా పందేలు
- రాత్రి వేళలో ఫ్లడ్‌లైట్ల వెలుగుల్లోనూ..
- అధికారం అండతో రెచ్చిపోయిన నేతలు
- వరసగా ఐదు పందేలు గెలిచిన వారికి బుల్లెట్
- పోలీసుల ప్రేక్షకపాత్ర.. చేతులు మారిన నగదు



తెలంగాణ నుంచి వచ్చి పందేలు

భోగి మొదలు కనుమ పండుగ రోజయిన బుధవారం వరకు బాపట్ల జిల్లావ్యాప్తంగా వివిధ జూదక్రీడల ద్వారా దాదాపు రూ.60కోట్లు చేతులు మారినట్లు తెలుస్తోంది. దాదాపుగా అందరికీ కనబడేలా ఆయా ప్రాంతాల నడి బొడ్డున సినీ సెట్టింగ్‌లను తలదన్నే రీతితో జిల్లాలో 9 వరకు బరులను ఏర్పాటుచేశారు. ఇందులో ప్రధానంగా పిట్టలవానిపాలెం మండలం మంతెనవారిపాలెం, చెరుకుపల్లి మండలం తూర్పుపాలెంలోని బరుల కు సెలబ్రిటీల తో పాటు సామాన్య జనం పోటె త్తారు. తెలంగాణ నుంచి పెద్దఎత్తున పందేల కోసం రాగా దాదాపుగా రూ.35కోట్ల వరకు వారి దే అన్నట్లు సమాచారం. గతంలో వీరిలో ఎ క్కువ శాతం పందేల కోసం భీమవరం బాట పట్టేవారు. కానీ ఈ దఫా అదే స్థాయిలో మంతెనవారి పాలెంలో బరిని ఏర్పాటుచేయడంతో ఇక్కడికి పోటెత్తారు.

ఐదు పందేలు కొడితే.. బుల్లెట్

మంతెనవారిపాలెం, తూర్పుపాలెంలోని బరుల నిర్వాహకులు రకరకాల ఆఫర్లతో పందెం రాయుళ్లను ఆకర్షించే ప్రయత్నం చేశారు. వరుసగా ఐదు పందేలు గెలిస్తే బుల్లెట్‌ను బహుమతిగా ప్రకటించారు. రెండు బరుల్లో కలిపి ముగ్గురి వరకు ఈ కానుకను గెలుచుకున్నట్లు తెలుస్తోంది. వరుసగా ఐదుసార్లు పందెం గెలవడంతో మంత్రిపాలేనికి చెందిన ప్రతాప్‌కు బుల్లెట్‌ను చిత్రనిర్మాత సూర్యదేవరనాగవంశీ, అనగాని శివప్రసాద్‌లు అందజేశారు.

రాత్రింబవళ్లు సందడే సందడి..

కొల్లూరు: కొల్లూరు మండలంలోని క్రాప అడ్డరోడ్డు, అనంతవరం గ్రామాల వద్ద ఏర్పాటు చేసిన కోడి బరుల వద్ద నాలుగు రోజులుగా కోలాహల వాతావరణం నెలకొంది. బరుల వద్ద గుండాట, నెంబర్ల ఆట, కోతముక్క, తదితరాలను అందుబాటులోకి తేవడంతో ఆ ప్రాంతం జూదరులతో సందడి సందడిగా మారింది. రూ.20 వేల నుంచి రూ.2 లక్షల వరకు కోడి పందేలు జరగ్గా జూద క్రీడల మాట సరేసరి. ఉదయం 8 నుంచి రాత్రి 9 గంటల వరకు కోడి పందాలు జరిగాయి. కోతముక్క, పేకాట మాత్రం రాత్రింబవళ్ళు సాగినట్లు సమాచారం. గురువారం కూడా కోడి పందేలు సాగుతాయని నిర్వాహకులు మైకుల ద్వారా ప్రచారం చేయడం గమనార్హం.

(నరసరావుపేట, బాపట్ల, తెనాలి, కొల్లిపర - ఆంధ్రజ్యోతి)

సంక్రాంతి సంప్రదాయాల ముసుగులో బాపట్ల, గుంటూ రు, పల్నాడు జిల్లాల్లో కోడిపందేలను యథేచ్ఛగా నిర్వహించారు. కత్తి కట్టిన కోళ్ల కాలు దువ్వగా రూ.లక్షలు చేతపట్టి సుదూర ప్రాంతాల నుంచి వేలాదిగా జూదరులు తరలివచ్చా రు. కోడి పందాలు, పేకాట, కోతముక్కాట, నెంబర్లాట అడ్డు అదుపు లేకుండా కొనసాగాయి. మూడు రోజులమీద కోడి పందాలు, కోతముక్కాట మీద సుమారు రూ.200 కోట్లు బెట్టింగ్‌లు జరిగి ఉంటాయని నిర్వాహకులు అంచనా వేస్తున్నారు. వీఐపీ బరిలో లక్ష నుంచి రూ.5 లక్షల పందేలు జరిగాయి. అధికార పార్టీ నేతల అండ.. కన్నెత్తి చూడని పోలీసులు.. బరి తెగించిన నిర్వాహకులతో కోట్లలో నగదు చేతులు మారాయి. బరుల వద్ద కోత ముక్క, నెంబర్లాటలను నిరాటంకంగా నిర్వాహకులు జరిపించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా మం గళవారం కనుమ పండుగ సందర్భంగా బుధవారం విచ్చల విడిగా కోడిపందాలు జోరుగా సాగాయి. భోగి పండుగ ముం దు రోజు అరెస్టులు.. బరుల తొలగింపులతో హడావుడి చేసిన పోలీసులు ఆ తర్వాత పత్తాలేకుండా పోయారు. ఫ్లెక్సీలు కట్టి.. మైకు ప్రచారాలతో పందేలపై నిర్వాహకులు హోరెత్తించినా మూడు రోజులు పోలీసులు ప్రేక్షకపాత్రకే పరిమితమయ్యారు. నేరుగా ప్రజా ప్రతినిధులు, అధికార పార్టీ నేతలే బరుల వద్ద ఉంటూ పందేలను పర్యవేక్షించారు. ఎక్కడయినా కోడి పందే లు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ప్రకటించిన పోలీసు అధికారులకు తీర ప్రాంత గ్రామాలతో పాటు, గుం టూరు, పల్నాడు జిల్లాల్లోని పలు పల్లెల నడిబొడ్డున ఏర్పాటు చేసిన బరులు మాత్రం కనిపించక పోవడం విశేషం. బరుల కు సమీపంలో జూదరుల వాహనాలను క్రమబద్ధీకరించడానికి పోలీసులు పరిమితమయ్యారు. ఇక బరుల వద్ద వీవీఐపీ, వీఐ పీ గ్యాలరీలతో పాటు సామాన్య జనం పందేలను వీక్షించడా నికి నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. బరిలోకి ప్రవేశిం చాలంటే ట్యాగ్‌లు, టోకెన్లు అందజేసి మరీ పందేలను నిర్వ హించారు. బరుల వద్ద జూదరుల కోసం నగదుకు ఇబ్బంది పడకుండా ప్రత్యేకంగా ఏటీఎం తరహా ఏర్పాట్లు కూడా చేశా రు. నేతల అండతో దర్జాగా బరులు ఏర్పాటు చేసిన నిర్వాహ కులు బరుల వద్దకు ప్రవేశించే విషయంలో బౌన్సర్లతో భద్రత ను కట్టుదిట్టం చేసి ఈ దఫా అత్యంత పకడ్బందీగా జూద క్రీడలను నిర్వహించారు. లక్ష రూపాయల చొప్పున పందేలు నడిచాయి. అడిగేదెవరూ.. ఆపేదెవరు అన్నరీతిలో లక్షలు దండుకున్నారు. కొన్ని బరుల వద్ద రాత్రి వేళల్లో ఫ్లడ్‌లైట్లు ఏర్పాటు చేసి పందేలు నిర్వహించారు. ప్రభుత్వం మారినా గతంలో కన్నా హంగు, ఆర్భాటాలు పెంచి మరీ జూదశిబిరా లు దిగ్విజయంగా నిర్వహించారు. పేకాట కూడా స్థాయిని బట్టి లక్ష నుంచి ఐదు లక్షల వరకు నడిచినట్లు సమాచారం. బరుల వద్ద కార్ల పార్కింగ్‌కు రూ.200, బైక్ పార్కింగ్‌కు వంద ఇలా అందిన కాడికి దోచేశారు. బరుల వద్దే పుష్కలంగా మందుతో పాటు మాంస పదార్థాలను కూడా అందుబాటులో ఉంచారు. మొత్తంమీద జూదరులకు బరుల వద్ద ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు. మండల స్థాయి కూటమి నేతలు కొందరు పందేల ను లాభసాటి వ్యాపారంగా మార్చుకున్నారని పార్టీ లోని వక్తులే బహిరంగంగానే విమర్శిస్తున్నారు. బరుల వద్దే మద్యం దుకాణాలను ఏర్పాటు చేసి అన్ని బ్రాం డ్లతో పాటు, బీర్లు లభించును అని బోర్డులను ఏర్పా టు చేసిన నిర్వాహకులు యథేచ్ఛగా మద్యం అమ్మకాలు చేశారు. బ్రాండ్‌ను బట్టి క్వార్టర్ బాటిల్‌కు రూ.100 నుంచి రూ.150 వరకు, ఫుల్ బాటిల్‌కు రూ.300కుపైనే అధికంగా వసూలు చేశారు. అయినా ఎక్సైజ్ అధికారులు కన్నెత్తి కూ డా చూడలేదు.



రొంపిచర్ల మండలం కొనకంచివారి పాలెం బరిలో కోడి పందేలు



యడ్లపాడు: సంగంగోపాలపురం వద్ద కోడిపందేలు

రొంపిచర్ల: కొనకంచివారిపాలెం సమీపంలో ఏర్పాటు చేసిన కోడి పందేల బరి



తీరంలో జోరుగా..

బాపట్ల జిల్లా పరిధిలోని తీర ప్రాంత గ్రామాల్లో 8 బరులతో కోడిపందేలు జోరుగా నిర్వహించారు. చెరుకుపల్లి మండలం తూర్పుపాలెంలో యథేచ్ఛగా కోడిపందాలు జరిగాయి. తెలంగాణ, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, జిల్లాల నుంచి వేలాది సంఖ్యలో జూదరులు తరలిరావడంతో తూర్పుపాలెం బరులు కిటకిటలాడాయి. సంక్రాంతి పండుగ రోజున మంత్రి అనగాని సత్యప్రసాద్, ఎంపీలు లావు శ్రీకృష్ణదేవరాయలు, సానా సతీష్, మాజీ ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు, సినీనిర్మాత సూర్యదేవరనాగవంశీ తదితరులు పందేలను వీక్షించారు. బరుల సమీపంలో కోతముక్క, పేకాటకు ప్రత్యేక గుడారాలను వేసి హైటెక్ క్లబ్ తరహాలో ఏర్పాటు చేశారు.

దుస్తులు, స్వీట్లు పంపిణీ

నగరం మండలం ఏలేటిపాలెం సపోటతోటల్లో వైసీపీకి చెందిన ఓ వ్యక్తి పేకాట, కోతముక్క, యథేచ్ఛగా రెండునెలలుగా కొనసాగిస్తున్నాడు. అయితే సంక్రాంతిని పురస్కరించుకుని దుస్తులు, కేజీ స్వీటు బాక్సులను జూదరులకు పంపిణీ చేసి ఉత్సాహపరిచారు. కనుమపండుగ రోజున నాటుకోడి, చిల్లిగారె, మటన్ ధమ్‌బిర్యాని అందజేశారని సమాచారం.

పల్నాడు జిల్లాలోనూ..

గోదావరి, కృష్ణా జిల్లాలకే పరిమితమైన కోడి పందేలు ఈ ఏడు పల్నాడు జిల్లాకు కూడా విస్తరించాయి. నరసరావు పేట, పెదకూరపాడు, చిలకలూరిపేట నియోజకవర్గాల్లో పెద్ద ఎత్తున కోడి పందేలు జరిగ్గా రూలక్షల్లో నగదు చేతులు మారింది. ప్రజాప్రతినిధుల అండతో విజయవంతంగా పందేలు జరిగాయి. కోడి పందేలపై ఫిర్యాదులు అందినా పోలీసులు పట్టీపట్టనట్లుగా ఉన్నారన్న విమర్శలున్నాయి. కొన్ని ప్రాంతాల్లో పోలీసు పహారాలో ప్రశాంతంగా పందేలు నిర్వహించారన్న విమర్శలున్నాయి. ఎస్పీ కే శ్రీనివాసరావు హెచ్చరికలు అమలు కాలేదు. నరసరావుపేట మండలం దొండపాడు, రొంపిచర్ల మండలం కొనకంచివారిపాలెం, ఎడ్వర్డ్‌పేట, నాదెండ్ల మండలం సాతులూరు, అమరావతి మండలంలోని లేమల్లె, పెదకూరపాడు మండలంలోని ముస్సాపురంలో కోడి పందేలు పెద్దఎత్తున జరిగాయి.



రేపల్లె: తూర్పుపాలెంలో జోరుగా నెంబర్లాట



తూర్పుపాలెంలో ఐదు పందేలు గెలిచిన మంత్రిపాలెం వాసులకు బుల్లెట్‌ను బహుకరిస్తున్న సినీ నిర్మాత నాగవంశీ,అనగాని శివప్రసాద్

చెరుకుపల్లి మండలం తూర్పుపాలెంలో జోరుగా కోడి పందేలు



7

మద్యం అమ్మకాల్లో.. సంక్రాంతి జోష్

- 2 రోజులుగా రూ.16.61కోట్ల విక్రయం

నడికుడిలో దొంగల బీభత్సం

- సీసీ కెమెరాలు పగులగొట్టి ఇంట్లో చోరీ
- లక్షల విలువైన బంగారం, నగదు అపహరణ

అనుమానాస్పద స్థితిలో బావ, బావమరిది మృతి

- కల్తీ మద్యమే కారణమా?

సంబరాలు.. సందళ్లు



యడ్లపాడు: లింగారావుపాలెంలో దేవతామూర్తుల తెప్పోత్సవం

- ఊరూరా వేడుకగా సంక్రాంతి
- పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలతో పండుగ

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

మూడు రోజుల పండుగతో పల్లెలు మురిశాయి. సంక్రాంతి సంబరాలతో ఊరూవాడా సందడి నెలకొంది. ఉద్యోగ, వ్యాపార ఇతర వృత్తులు, ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు స్వగ్రామాలకు చేరి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలసి వేడుకలు నిర్వహించుకున్నారు. చిన్నారులు, విద్యార్థులు గాలిపటాలు ఎగరేసి సందడి చేశారు. పలుగ్రామాల్లో సంక్రాంతి సంబరాలను మూడు రోజులపాటు కుటుంబసభ్యులతో కలిసి ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. ఆటపాటలు, సంస్కృతిక కార్యక్రమాలతో గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది. సంక్రాంతి, కనుమ సందర్భంగా ఉద యాన్నే ఇళ్లముంగిట రంగవల్లులు వేసి, గొబ్బిళ్లను అమ ర్చి అందంగా తీర్చిదిద్దారు. కొత్తపంట బియ్యంతో పొం గలి సిద్ధం చేసి నైవేద్యం సమర్పించారు. కనుమనాడు రథం ముగ్గులతో ముంగిళ్లను తీర్చిదిద్దారు. పలు గ్రా మాల్లో ముగ్గుల పోటీలు నిర్వహించి, విజేతలైన మ హిళలకు బహుమ తులను అందజేశారు. ఎడ్ల పం దేలు, క్రికెట్, వాలీబాల్, ముగ్గుల పోటీల్లో యువత, మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎక్కడి కక్కడ యువత ఆధ్వర్యంలో క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలు పెద్దఎత్తున జరిగాయి. పలు గ్రామాల్లో నాటికల పోటీలు కూడా నిర్వహించారు. మకర సంక్రాంతి సందర్భంగా ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. పలు ఆలయాల్లో గోదాదేవి కల్యాణాలు కనుల పండువగా జరిగా యి. దేవతా మూర్తుల ఊరేగింపులు, తెప్పోత్సవాలు ఘనంగా జరిగాయి. గుంటూరు, నరసరావుపేట, బాపట్ల తదితర ప్రాంతాల్లో అయ్యప్ప స్వామి దేవాలయాల్లో మకరజ్యోతిని భక్తులు దర్శించుకున్నారు. పడిపూజ ఘనంగా జరిపారు. కనుమ సందర్భంగా రైతులు పశువులను అలంకరించి ప్రత్యేకంగా పూజలు చేశారు. గ్రామాల్లో గోపూజలు ఘనంగా జరిగాయి. కనుమకు మాంసాహారం తినేందుకు ప్రజలు ప్రత్యేక ఆసక్తి చూపారు. జిల్లా కేంద్రం గుంటూరులో తెల్లవారుజాము నుంచే మటన్, చికెన్ స్టాల్స్ ఎదుట మాంసాహార ప్రియులు క్యూ కట్టారు.

- గుంటూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ మున్సిపల్ క్రీడా ప్రాంగణంలో సంక్రాంతి సంబరాలు అంగరంగ వైభవంగా జరిగాయి. మంగళవారం గంగిరెద్దులు, ఎద్దుల ప్రదర్శనలు, వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన, కర్రసాము, కోలాటాలు, స్టార్ మ్యూజికల్ నైట్, కాంతారా యాక్ట్, జగలర్స్ షో, బటర్ ఫ్లై, రోబో యాక్ట్ ప్రదర్శనలతో ఎన్టీఆర్ స్టేడియం గ్రామీణ వాతావరణ శోభతో అలరారింది.
- నరసరావుపేట ఎస్పీ కార్యాలయ ఆవరణలో సంప్రదాయబద్ధంగా సంక్రాంతి సంబరాలను పోలీసులు జరుపుకున్నారు సంబరాల్లో భాగంగా ఎస్పీ కంచి శ్రీనివాసరావు పాల్గొన్నారు.
- దుగ్గిరాల మండలం ఈమనిగ్రామంలో ఒకే కుటుంబానికి చెందిన వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన 60మందికి పైగా ఆనందోత్సాహాల మధ్య సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్నారు.



అమరావతిలో మకర జ్యోతి ప్రజ్వలన చేస్తున్న భక్తులు



ఈపూరు: కర్ణాటక జట్టుతో కబడ్డీ ఆడుతున్న చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

అమరావతి.. ఆనందం



- రాజధాని రైతులకు కౌలు బకాయిల చెల్లింపు
- చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఫొటోలకు పాలాభిషేకం
- ఐదేళ్ల నిరీక్షణ అనంతరం గ్రామాల్లో పండుగ శోభ
- ఆరేడు నెలలుగా రాజధానిలో నిర్మాణ పనులు పరుగులు

తుళ్లూరు, గుంటూరు, జనవరి 15(ఆంధ్రజ్యోతి): రాజధాని రైతుల ఇంట.. ఈ సంక్రాంతి సంతోషాల పంటను తీసుకు వచ్చింది. ఒకవైపు ఆరేడు నెలలుగా రాజధానిలో పనులు పరుగులు తీస్తుండగా.. కొన్నేళ్లుగా నిలిచిపోయిన రాజధాని కౌలు బకాయిలను కూటమి ప్రభుత్వం భోగి రోజు విడుదల చేసింది. దీంతో రాజధాని గ్రామాల్లోని ప్రతీ ఇంటా ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. వైసీపీ పాలనలో ఐదేళ్లపాటు నిత్య నరకం అనుభవించి, పండుగలూ, పర్వదినాలకు దూరమైన రైతులు ఈ ఏడాది సంక్రాంతి సంబరాలను ఉత్సాహంగా జరుపుకున్నారు. వైసీపీ పాలకులు, నాటి అధికారపార్టీల నేతల వేధింపులను ఎదుర్కొంటూనే గత ఐదేళ్ల రాజధాని వాసులు పోరుబాటపట్టారు. కిందటేడాది సంక్రాంతి సందర్భంగా మందడంలో టీడీపీ- జనసేన కూటమి 'భోగి సంకల్పం' కార్యక్రమాన్ని నిర్వహించి చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు అమరావతిపై వైసీపీ ప్రభుత్వం తెచ్చిన చీకటి జీవోలను మంటల్లో కాల్చేశారు. అదే వేదికగా మరో 87 రోజుల్లో కొత్త ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, అమరావతి నుంచి ప్రజా పరిపాలన ప్రారంభమవుతుందని, బంగారంలాంటి రాజధానిని నిర్మిస్తామని చంద్రబాబు ప్రకటించారు. ఇచ్చిన మాట ప్రకారం అధికారం చేపట్టిన మరుక్షణం నుంచి రాజధాని నిర్మాణపనులను పరుగులు పెట్టించారు. ప్రమాణ స్వీకారానికి ముందే రాజధాని గ్రామాల్లోని 25వేల ఎకరాల్లో రూ.36.5కోట్లు ఖర్చు చేసి జంగిల్ క్లియరెన్స్ చేశారు. ఐదేళ్ల క్రితం ఆగిపోయిన ప్రభుత్వ భవనాల నిర్మాణం సహా పలు పనుల నిమిత్తం తాజాగా రూ.24 వేల కోట్ల పనులకు ప్రభుత్వం ఆమోద ముద్ర వేసింది. మరో 11,467 కోట్లకు పనులకు ప్రభుత్వం బుధవారం పరిపాలనా ఆమోదం తెలిపింది. దీంతో అమరావతి నిర్మాణం పరుగులు పెట్టనున్నాయి. ఇప్పటికే రాజధానిలో కీలకమైన సచివాలయ భవన సముదాయ నిర్మాణ పనులకు ప్రభుత్వం రూ.4,890 కోట్లు కేటాయించింది. పునాదుల్లో చేరిన నీటిని భారీ మోటార్లతో తోడుతున్నారు. ఈ నెలాఖరులోపు ఆ పనులు కూడా ప్రారంభమవబోతున్నాయి.

కౌలు చెల్లింపులతో పండుగే.. పండుగ

రాజధాని రైతులకు గత ప్రభుత్వం పెట్టిన కౌలు బకాయిలను కూడా కూటమి ప్రభుత్వం చెల్లించింది. గత వైసీపీ ప్రభుత్వం రైతులకు రెండేళ్లపాటు కౌలు నిలిపివేయడంతో ఆ బకాయిలే రూ.525 కోట్లకు పైగా ఉంది. అందులో తొమ్మిదో ఏడాది కౌలు బకాయిలను కూటమి ప్రభుత్వం వచ్చిన మూడు నెలల్లో చెల్లించింది. కాగా అసైన్డ్ రైతులకు సీఐడీ కేసుల కారణంగా బకాయిలు పెండింగులో పడిపోయాయి. ఈ ఆరునెలల్లో వారి కేసులను పరిష్కరించి, వారికి కూడా రాష్ట్ర ప్రభుత్వం కౌలు చెల్లించింది. సాధారణరైతులు 24 వేల మంది రైతులకు ఇచ్చే పదో ఏడాది కౌలుతో పాటు, 3,123 మంది అసైన్డ్ రైతులకు మూడేళ్ల కౌలు బకాయిలను చెల్లించింది. దీంతో తుళ్లూరు, రాయపూడిలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు రాజధానివాసులు పాలాభిషేకం చేశారు. బాణాసంచా కాల్చారు. స్వీట్లు పంపిణీ చేసుకున్నారు. కౌలు బకాయిల విడుదలతో దళిత, ముస్లిం మైనార్టీ కుటుంబాలు నిజమైన పండుగ జరుపుకుంటున్నామని దళిత బహుజన జేఏసీ అధ్యక్షుడు చిలకా బసవయ్య తెలిపారు. కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, పురపాలక శాఖ మంత్రి నారాయణ, సీఆర్డీఏ కమిషనర్ భాస్కర్, ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్‌లకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.



తుళ్లూరులో చంద్రబాబు, పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న రైతులు మహిళలు



వార్షిక కౌలు ఇవ్వడంతో స్వీట్లు పంచుకుంటున్న రైతులు

6 ఆంధ్రజ్యోతి
చిత్రజ్యోతి
SINCE 1965
గుంటూరు ● గురువారం 16 జనవరి 2025

పండగవేళ... సరికొత్త లుక్కులు



సంక్రాంతి సందర్భంగా స్టార్ హీరోల నుంచి చిన్న హీరోలు నటిస్తున్న సినిమాల వరకు కొత్త పోస్టర్స్ విడుదలయ్యాయి. ఈ ప్రచార చిత్రాలతో ప్రేక్షకులకు పండగ శుభాకాంక్షలు తెలిపారు మేకర్స్.

'రాజాసాబ్' నుంచి ప్రభాస్ లుక్‌ను విడుదల చేశారు మేకర్స్. శర్వానంద్ కథానాయకుడిగా రామ్ అబ్బరాజు దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'నారీ నారీ నడుమ మురారీ' టైటిల్‌ను ప్రకటించారు. విశ్వక్‌సేన్ నటిస్తున్న 'లైలా'లో ఫీమేల్ లుక్‌ను రివీల్ చేశారు. బ్రహ్మానందం, రాజా గౌతమ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న 'బ్రహ్మ ఆనందం' నుంచి కొత్త స్టిల్‌ను విడుదల చేశారు. కిరణ్ అబ్బవరం, రుక్సర్ ధిల్లాన్ జంటగా తెరకెక్కుతున్న 'దిల్‌రూబా' వచ్చే నెల 14న విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. విక్రాంత్, చాందినీ చౌదరి జంటగా నటిసున్న సినిమా 'సంతాన ప్రాప్తిరస్తు' నుంచి కొత్త పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు.

తారల సంక్రాంతి సంబరాలు







తారలు సంక్రాంతిని ఘనంగా సెలబ్రేట్ చేసుకున్నారు. ఈ సందర్భంగా దిగిన ఫొటోలను సోషల్‌మీడియాలో అభిమానులతో పంచుకున్నారు. మెగాస్టార్ చిరంజీవి ట్రెడిషనల్ లుక్‌లో కనువిందు చేశారు. రామ్‌చరణ్ తన సతీమణి ఉపాసన, కూతురు క్లీంకారతో కలసి ఫొటో దిగారు. అల్లు అర్జున్ తన సతీమణి స్నేహా రెడ్డి, కూతురు అర్హ, తనయుడు అయాన్‌తో కలసి పిక్ తీసుకున్నారు. మోహన్‌బాబు దంపతులు, తనయుడు విష్ణు ఫ్యామిలీతో తిరుపతిలో కలసి ఫొటోలు దిగారు. వరుణ్‌తేజ్ తన సతీమణి లావణ్యతో కలసి గాలిపటాలు ఎగరేస్తూ ఫొటోలకు ఫోజిచ్చారు. నూతన దంపతులు నాగచైతన్య, శోభితా ధూళిపాళతో సంప్రదాయ దుస్తుల్లో పిక్ తీసుకున్నారు. ఇటీవలే వివాహ బంధంలోకి అడుగుపెట్టిన కీర్తి సురేశ్, ఆంటోని తట్టిల్ జంటగా పండగ వేడుకల్లో తీసుకున్న ఫొటోలను షేర్ చేశారు. అలాగే విఘ్నేష్ నయనతార దంపతులు పిల్లలతో కలసి దిగిన పండగ ఫొటోను షేర్ చేశారు.





నా కెరీర్‌లో మరో బిగ్ బ్లాక్ బస్టర్



వెంకటేశ్

'మా సినిమాను ఇంతగా ఆదరిస్తున్న ప్రేక్షకులకు, అభిమానులకు ధన్యవాదాలు. మేం మంచి ఫ్యామిలీ సినిమా ఇవ్వాలనే ఆలోచనతో సంక్రాంతికి వస్తున్నాం అని చెప్పాం. నా కెరీర్‌లో మరో బిగ్ బ్లాక్ బస్టర్ ఇచ్చిన దర్శకుడు అనిల్‌కు థాంక్స్' అని అన్నారు విక్టరీ వెంకటేశ్. ఆయన నటించిన 'సంక్రాంతికి వస్తున్నాం' విడుదలై విజయం సాధించిన నేపథ్యంలో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. దర్శకుడు అనిల్ మాట్లాడుతూ 'సాధారణంగా బెనిఫిట్ షోలకు ఫ్యాన్స్, యూత్ వెళుతుంటారు. కానీ తొలిసారి ఉదయం నాలుగున్నర షోకి ఫ్యామిలీ ఆడియన్స్ రావడం చాలా ఆనందం కలిగించింది' అన్నారు. సినిమాను హిట్ చేసిన ప్రేక్షకులకు నిర్మాత దిల్ రాజు ధన్యవాదాలు తెలిపారు. పైరసీని ఎంకరేజ్ చేయకుండా థియేటర్లలోనే సినిమా చూడాలని ఆయన కోరారు.

అందమైన ప్రేమకథ



'బేబీ' కలయిక మరోసారి రిపీట్ అవుతోంది. ఆ సినిమాతో సూపర్ హిట్ కొట్టిన ఆనంద్ దేవరకొండ, వైష్ణవిచైతన్య జంటగా మరో చిత్రం తెరకెక్కనుంది. '90స్' వెబ్ సిరీస్‌తో గుర్తింపు తెచ్చుకున్న ఆదిత్య హసన్ దర్శకత్వం వహించనున్న ఈ చిత్రాన్ని సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఈ మేరకు 'యాన్ అన్‌ఫినిష్డ్ స్టోరీ' పేరుతో ఓ అనౌన్స్‌మెంట్ వీడియో విడుదల చేశారు. 'మీరు చూసిన మిడిల్ క్లాస్ ఫ్యామిలీ డ్రామా '90స్'లోంచి పుట్టిన అందమైన ప్రేమకథ ఇది. అన్ని వర్గాలను ఆకట్టుకునేలా చిత్రం తెరకెక్కనుంది" అని పేర్కొన్నారు. త్వరలోనే మరిన్ని వివరాలు ప్రకటించనున్నారు. ఈ సినిమాకు ఎడిటర్: నవీన్ నూలి, సినిమాటోగ్రాఫర్: అజీమ్ మహమ్మద్, సంగీతం: హేషమ్ అబ్దుల్ వహాబ్.

ఆస్కార్ వేడుక రద్దు అవుతుందా?



అమెరికాలోని లాస్‌ఏంజిల్స్ ప్రాంతాన్ని కార్చిచ్చు చుట్టుముట్టి, ఎంతో ఆస్తి నష్టం, ప్రాణ నష్టం కలిగించిన ఫలితం ఇప్పుడు ఆస్కార్ అవార్డుల వేడుకలపై కూడా ప్రభావం చూపుతోందా?. టామ్ హాంక్స్, ఎమ్మా స్టోన్, మెల్ గిబ్సన్, స్టీవెన్ స్పీల్‌బర్గ్ వంటి హాలీవుడ్ ప్రముఖులు ఈ అగ్ని ప్రమాదంతో ఇళ్లు కోల్పోయారు. అలాగే ఆస్కార్ కమిటీలోని నలుగురు సభ్యులు కూడా ఈ కార్చిచ్చు వల్ల ఇళ్లు కోల్పోవడంతో మార్చి రెండున జరగాల్సిన ఆస్కార్ వేడుక రద్దు కావచ్చనే వార్తలు వినిపిస్తున్నాయి. అదే నిజమైతే.. 96 ఏళ్ల ఆస్కార్ చరిత్రలో అవార్డుల వేడుక రద్దు కావడం ఇదే తొలిసారి అవుతుంది. కరోనా వంటి క్లిష్ట సమయంలో కూడా ఆస్కార్ కమిటీ వేడుకని వాయిదా వేసింది తప్ప రద్దు చేయలేదు. ఇప్పుడు కూడా అలాగే చేయవచ్చని కొంతమంది అంటున్నారు. కనీ వినీ ఎరుగని రీతిలో ఇలా కార్చిచ్చు వ్యాపించి లాస్ ఏంజిల్స్‌ను బూడిద కుప్పగా మార్చడంతో ఈ నెల 23న జరగాల్సిన నామినేషన్స్ ప్రకటన వాయిదా వేశారు. పరిస్థితిని గమనిస్తున్న ఆస్కార్ కమిటీ అవార్డుల వేడుక జరిగే తేదీలో ఏదన్నా మార్పు ఉంటే త్వరలో ప్రకటిస్తుందని అంటున్నారు.

స్వామియే శరణం అయ్యప్ప

● వైభవంగా సంపత్‌నగర్ అయ్యప్పస్వామి ఆలయంలో మకర జ్యోతి దర్శనం

గుంటూరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సంపత్‌నగర్‌లోని అయ్యప్పస్వామి దేవస్థానంలో మకర సంక్రాంతి పర్వదినాన మకర జ్యోతి దర్శన మహోత్సవం ఈ ఏడాది కూడా క్రేన్ అనుబంధ సంస్థ క్రేన్ రిలీజియస్ ట్రస్ట్, క్రేన్ సంస్థల చైర్మన్ గ్రంధి వెంకటసత్యలక్ష్మీ కాంతారావు, లక్ష్మీ హైమావతి దంపతుల ఆధ్వర్యంలో మంగళవారం వైభవంగా జరిగింది. మంగళవారం సాయంత్రం 5.01 గంటలకు స్వామి వారికి తిరువాభరణాలను సంపత్‌నగర్‌లోని క్రేన్ వక్కపొడి ఫ్యాక్టరీ నుంచి దేవాలయానికి కాంతారావు దంపతులు, వారి పెద్ద అల్లుడు మానేపల్లి దివాకర్, పెద్ద కుమార్తె హిమజ, కుటుంబ సభ్యులు, భక్తులు దేవాలయానికి తీసుకొచ్చారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులతో శరణు ఘోష నడుమ క్రేన్ గ్రూపు సంస్థల చైర్మన్ గ్రంధి కాంతారావు దంపతులు మకర జ్యోతిని వెలగించారు. అదే సమయంలో ఆకాశంలో స్వామి వారు నక్షత్ర దర్శనం ఇవ్వటంతో భక్తులు స్వామియే శరణం అయ్యప్ప అంటూ శరణు ఘోషతో పులకరించిపోయారు. ఈ సందర్భంగా జీవీఎస్ఎల్ కాంతారావు మాట్లాడుతూ గత 49 ఏళ్లుగా సంపత్‌నగర్ అయ్యప్ప స్వామి దేవాలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, జిల్లా నలుమూలల నుంచి లక్షలాది మంది స్వామి భక్తులు, దీక్షా స్వాములు ఆలయాన్ని ప్రతి ఏటా సందర్శిస్తారన్నారు. మంగళవారం జరిగిన మకర జ్యోతి దర్శన మహోత్సవం గుంటూరు చరిత్రలో మరువరానిదన్నారు. ప్రతి ఏటా డిసెంబరు, జనవరి మాసాల్లో కాకుండా ప్రతి రోజూ నిత్యం అయ్యప్పస్వామికి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో క్రేన్ గ్రూప్ సంస్థల సిబ్బంది, టంగుటూరి మణి, నగర ప్రముఖులు హాజరయ్యారు. అనేక మంది అయ్యప్పస్వామి భక్తులు ప్రత్యేక వాహనాల్లో సాయంత్రం దేవస్థానం నుంచి శబరిమలకు బయల్దేరారు.

మద్యం అమ్మకాల్లో.. సంక్రాంతి జోష్

● గత 2 రోజులుగా రూ. 16.61 కోట్ల విక్రయం

గుంటూరు కార్పొరేషన్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండగ కు మద్యం అమ్మకాలు మరింత ఊపందుకున్నాయి. వాడవాడలా మద్యం అమ్మకాలు జోరుగా సాగాయి. సొంత ఊర్లకు తరలివచ్చిన ప్రజానీకంతో ఆయా గ్రామాలు, పట్టణాలు సంక్రాంతి శోభను సంతరించుకున్నాయి. పండగ మూడు రోజులు భారీ స్థాయిలో ఎక్సైజ్ శాఖకు ఆదాయం చేకూరింది. గతేడాది డిసెంబర్ 31, ఈ ఏడాది జనవరి 1, సంక్రాంతి పండగను పురస్కరించుకొని 12వ తేదీ నుంచి గత 4 రోజులుగా మద్యం అమ్మకాలు జోరుగా సాగాయి. గుంటూరు, పల్నాడు జిల్లాలలో మద్యం అమ్మకాలు వరదలై పారాయి. దీంతో ఎక్సైజ్ ఖజానాకు కోట్లలో ఆదాయం చేకూరింది. లంక ప్రాంతాల్లో, కరకట్ట మొదలుకొని చివరి వరకు పెద్ద ఎత్తున కోడి పందేలు, పేకాట బంకినీలు నిర్వహించారు. వేలాదిమంది సందర్శకులు పేకాట ప్రాంతాలకు, కోడి పందేల నిర్వహణ ప్రాంతాలకు వచ్చారు. అక్కడ పెద్ద ఎత్తునస్నేహితులతో కలిసి ఖుషి ఖుషీగా మద్యం తాగారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఈ ఏడాది న్యూ ఇయర్‌లో మద్యం అమ్మకాలు రూ. 9.93 కోట్ల అమ్మకాలు జరగ్గా, సంక్రాంతి సందర్భంగా మూడు రోజుల పాటు రూ.16.61మద్యం అమ్మకాలు జరిగాయి. గుంటూరు, పల్నాడు జిల్లాలలో పెద్ద ఎత్తున కోడి పందేలు జరిగాయి.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం బుధవారం నాటికి 563.00 అడుగులు ఉంది. ఇది 239.42 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9833 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 6791 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్ఎల్‌సీ ద్వారా 280 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 19,304 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో బుధవారం 37.72 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. పవర్ జనరేషన్ ద్వారా రెండు వేల క్యూసెక్కులు దిగువ కృష్ణకు విడుదల అవుతుందన్నారు.

తెనాలిలో టెన్షన్.. టెన్షన్

● రజక చెరువు కూడలిలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు
● అనుమతి లేదన్న మున్సిపల్ అధికారులు
● తొలగించాలంటూ మరికొందరు
● మంత్రి మనోహర్ చొరవతో సద్దుమణిగిన వివాదం



అంబేడ్కర్ విగ్రహం, తొలగిస్తారన్న ఆలోచనతో అక్కడకు చేరిన ఐతానగర్ వాసులు

తెనాలి(మారీస్‌పేట), జనవరి 15, (ఆంధ్రజ్యోతి): రాత్రికి రాత్రే అంబేడ్కర్ విగ్రహాన్ని ఓ సామాజిక వర్గం ఏర్పాటు చేస్తే, అనుమతి లేకుండా ఏర్పాటు చేశారని, ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నందున వెంటనే తొలగించాలంటూ మరో సామాజిక వర్గం పట్టుబట్టింది. అటు మున్సిపల్ అధికారులు కూడా అనుమతి లేకుండా ఏర్పాటు చేశారంటూ బాధ్యులపై చర్యలు తీసుకోవాలని తెనాలి టు టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయటం, విగ్రహం తొలగించకుండా కాపాడుకునేందుకు తరలి రావాలంటూ చలో తెనాలికి మరికొందరు పిలుపునివ్వటంతో తెనాలిలో టెన్షన్ వాతావరణం ఏర్పడింది. తహసీల్దార్ మండల మెజిస్ట్రేట్ హోదాలో శాంతిభద్రతలకు సంబంధించి ఉత్తర్వులు జారీ చేశారు. అయితే దీనిపై మంత్రి మనోహర్ జోక్యం చేసుకోవటంతో టెన్షన్ వాతావరణం సర్దుమణిగింది. తెనాలి రజక చెరువు కూడలిలో గతంలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేసేందుకు ఒక పెద్దపాటి దిమ్మెను నిర్మించారు. అయితే అప్పటి నుంచి అక్కడ విగ్రహం మాత్రం పెట్టలేదు. తాజాగా విగ్రహం ఏర్పాటుకు నిర్మాణ కమిటీ సన్నాహాలు చేయటంతో అధికారులు అనుమతి లేకుండా పెట్టవద్దని వారికి ముదుగానే సూచించారు. అయితే తమ దగ్గర అన్ని అనుమతులూ ఉన్నాయంటూ కమిటీ సభ్యులు, మరికొందరు అంబేడ్కర్ అభిమానులు సోమవారం అర్ధరాత్రి హడావుడిగా విగ్రహాన్ని క్రేన్ సాయంతో ఏర్పాటు చేశారు. మంగళవారం మున్సిపల్ అధికారులు విగ్రహాన్ని తొలగించాలని కోరటం, కమిషనర్ శేషన్న వారితో సంప్రదింపులు జరిపినా వారు దానికి అంగీకరించలేదు. తెనాలి పట్టణంలోకి వచ్చే ప్రధాన రహదారి అదే కావటం, రద్దీ ఎక్కువగా ఉండే రోడ్డు కావటంతో ఎక్కువ విస్తీర్ణంలో కట్టిన దిమ్మెను తొలగించి విగ్రహం ఏర్పాటు చేసేందుకు కావాల్సినంత దిమ్మెను నిర్మించుకోవాలని, లేదంటే పూర్తిగా దిమ్మెను తొలగించేస్తే, మేమే మరోచోట విగ్రహ నిర్మాణం చేయించుతామనే హామీలిచ్చినా వారు మాత్రం తొలగించటానికి వీలులేదని భీష్మించారు. అయితే అక్కడే ఉన్న మరో సామాజికవర్గం ట్రాఫిక్ ఇబ్బందుల దృష్ట్యా తొలగించాలని కోరటంతో మరింత వేడెక్కింది. ఇరువర్గాలు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కలిసి విన్నవించారు. అయితే విగ్రహం తొలగించటం మా అభిమతం కాదనీ, అంబేడ్కర్ విగ్రహం తొలగింపు విషయంలో వస్తున్న ప్రచారాన్ని నమ్మాల్సిన పనిలేదనీ, ఎవరూ ఆందోళన పడాల్సిన పనిలేదని తేల్చిచెప్పటంతో వారంతా శాంతించారు. అయితే విగ్రహ నిర్మాణ కమిటీ సభ్యులంతా డీఎస్పీ జనార్ధనరావు, తహసీల్దార్ గోపాలకృష్ణ, కమిషనర్ శేషన్న, ఇతర అధికారుల సమక్షంలో సమావేశమై మాకు నమ్మకం కలిగిందనీ, ఎటువంటి ఆందోళన ఉండదని పేర్కొన్నారు. శాశ్వత విగ్రహం ఏర్పాటుకు సహకరించాలని, రజక చెరువులో కొంత విస్తీర్ణాన్ని అంబేడ్కర్ లైబ్రరీ, కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి కేటాయించాలని కోరారు. ఇదిలా ఉంటే అంబేడ్కర్ విగ్రహాన్ని కాపాడుకునేందుకు అందరూ తెనాలి తరలిరావాలంటూ చలో తెనాలికి పిలుపునివ్వటం చర్చనీయాంశమైంది. అధికార పార్టీ నాయకుడు, న్యాయవాది హరిదాసు గౌరీశంకర్, మరికొందరు నాయకులు కూడా తాము విగ్రహ ఏర్పాటుకు వ్యతిరేకం కాదని, దీనిని కావాలనే కొందరు బయటి వ్యక్తులు ప్రవేశించి గొడవలు సృష్టించేందుకు కుట్ర చేశారని, ఆ కుట్రను నిర్మాణ కమిటీ నమ్మకుండా ఎటువంటి అలజడులు లేకుండా తెనాలిలో శాంతియుత వాతావరణానికి సహకరించటం గొప్ప విషయమని పేర్కొన్నారు.

పుకార్లను నమ్మవద్దు

అంబేడ్కర్ విగ్రహాన్ని మున్సిపల్ అధికారులు తొలగిస్తారంటూ వస్తున్న పుకార్లలో ఏమాత్రం వాస్తవం లేదనీ, కేవలం ప్రజల్లో అలజడిరేపేందుకు కొందరు చేస్తున్న ప్రచారం మాత్రమేనని పురపాలక సంఘ కమిషనర్ బండి శేషన్న అన్నారు. బుధవారం స్థానిక పురపాలక సంఘ కార్యాలయంలో మున్సిపల్ శేషన్న, తహసీల్దార్ గోపాలకృష్ణ, డీఎస్పీ జనార్ధనరావులతో కలసి విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ అధికారులు ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని అయినా ప్రజల్లో ఆ విగ్రహం తొలగిస్తారనే అపోహలు నెలకొనడంతో విగ్రహ నిర్మాణ సభ్యులు ఆందోళనలు చేపట్టారని చెప్పారు. విగ్రహంపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించడానికి కమిటీ సభ్యులతో చర్చించామని, వారు కూడా సానుకూలంగా స్పందించి విగ్రహం తొలగింపు లేదనే విషయంపై స్పష్టత పొందారని చెప్పారు.

ప్రైవేటు ట్రావెల్స్ చార్జీల బాదుడు

గుంటూరు, జనవరి 15(ఆంధ్రజ్యోతి): సంక్రాంతికి కొన్ని ప్రైవేటు ట్రావెల్స్ యాజమాన్యాలు చార్జీల దోపిడీకి తెరతీశాయి. టిక్కెట్ల కృత్రిమ కొరతను సృష్టించి రోజుకో రేటుతో బాదుడు ప్రారంభించాయి. మూడు రోజుల ముచ్చటైన పండగకు సొంతూళ్లకు వచ్చిన ప్రయాణికులు తిరిగి గమ్యస్థానాలకు చేరుకునేందుకు సిద్ధమయ్యారు. ఉద్యోగ, విద్యా, వ్యాపార ఇతర కార్యకలాపాలతో హైదరాబాద్, చెన్నై, బెంగళూరుతో పాటు ఇతర దూర ప్రాంతాల్లో స్థిర పడిన వారు పండుగకు జిల్లాకు చేరుకున్నారు. మూడు రోజుల పండగ ముగిసిన నేపథ్యంలో తిరుగుపయనం కోసం ఎవరికి వారు ఆర్టీసీ, రైల్వేతో పాటు ప్రైవేటు ట్రావెల్స్ యాజామాన్యాలను ఆశ్రయిస్తున్నారు. ఇప్పటికే రైల్వేతోపాటు ఆర్టీసీ కూడా అదనపు సర్వీసులను ఏర్పాటు చేసింది. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా రైల్వేలో టిక్కెట్లు దొరకకపోవటం, ఆర్టీసీలో కూడా అంతంతమాత్రంగా ఉండటంతో కొందరు ప్రయాణికులు ప్రైవేటు ట్రావెల్స్‌లో తిరుగు ప్రయాణం చేసేందుకు మొగ్గు చూపుతున్నారు. ఆర్టీసీ ఈ దఫా పండగకు స్పెషల్ సర్వీసులకు కూడా సాధారణ చార్జీలనే వసూలు చేస్తున్నారు. ఆర్టీసీలో గుంటూరు నుంచి కేపీహెచ్‌బీకి సాధారణ నాన్ ఏసీకి రూ. 540, ఇంద్ర ఏసీకి రూ. 870 కాగా అమరావతి ఏసీకి రూ. 700 వసూలు చేస్తున్నారు. ఇక గుంటూరు నుంచి చెన్నైకి సూపర్ లగ్జరీ నాన్ ఏసీ సర్వీసుకు రూ. 760, కాగా గుంటూరు నుంచి బెంగళూరుకు నాన్ ఏసీ సూపర్ లగ్జరీకి రూ. 1150, అమరావతి ఏసీకి 1850, ఇంద్ర ఏసీకి రూ. 1460 చార్జీ వసూలు చేస్తున్నారు. పండగ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని కొన్ని ప్రైవేటు ట్రావెల్స్ యాజమాన్యాలు టిక్కెట్ చార్జీల దోపిడీ చేస్తున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గుంటూరు నుంచి హైదరాబాద్‌కు సాధారణ నాన్ ఏసీ అయితే రూ. 700ల నుంచి పైనే వసూలు చేస్తున్నారు. ఏసీ సర్వీసు అయితే రూ. వెయ్యి పైనే వసూలు చేస్తున్నారు. ఇక బెర్త్ అటువంటివి అయితే రూ. 2వేలు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. గుంటూరు నుంచి చెన్నైకు కూడా రూ. వెయ్యిపైనే చార్జీలు వసూలు చేస్తున్నారు. బెంగళూరుకు కూడా రూ. 3వేల వరకు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

డిమాండ్‌ను బట్టి రోజుకో రేటు

పండగ ముగిసిన రోజు బుధవారం రాత్రి టిక్కెట్ చార్జీల ధర ఒకలా ఉంటే మరుసటి రోజు గురువారం రాత్రి చార్జీల ధర మరోలా ఉంటుంది. కనుమ రోజే తిరుగు ప్రయాణమయ్యేందుకు అత్యవసరమైన వారు తప్ప అత్యధికశాతం మంది పెద్దగా ఆసక్తి చూపటం లేదు. గురువారం రాత్రి నుంచి తిరుగు ప్రయాణమయ్యేందుకు అత్యధిక శాతం మంది సిద్ధమవుతున్నారు. ఇదే అదునుగా భావిస్తున్న కొన్ని ప్రైవేటు ట్రావెల్స్ యాజమాన్యాలు ముందుగానే టిక్కెట్లు బుక్ అయిపోయినట్లు కృత్రిమ కొరతను సృష్టించి టిక్కెట్ చార్జీలను అమాంతం పెంచేసి ప్రజల నుంచి చార్జీల దోపిడీ చేస్తున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. ఆర్టీఏ అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించి సామాన్య ప్రయాణికులకు టిక్కెట్ చార్జీలు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలి.

నడికుడిలో దొంగల బీభత్సం

● సీసీ కెమెరాలు పగులగొట్టి ఇంట్లో చోరీ
● లక్షల విలువైన బంగారం, నగదు అపహరణ



దొంగలు పగులగొట్టిన తాళాలను చూపుతున్న నడికూడి గ్రామ వాసి సయ్యద్ పెద్దసైదా

దాచేపల్లి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగకు తాళాలు వేసి ఊర్లకు వెళ్లిన ఇళ్లను లక్ష్యంగా చేసుకొని దొంగతనాలు జరిగిన సంఘటన బుధవారం దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలోని నడికుడిలో సాయిబాబా గుడి సమీపంలో రెండిళ్లలో, మరోచోట మెయిన్‌బజారులో ఉన్న మరో మూడిళ్లలో, పొందుగల గ్రామ పంచాయతీ శివారు శ్రీని వాసపురంలో రెండు ఇళ్లల్లో చోరీలు జరిగాయి. బాధితులంతా పండుగకు ఊరెళ్లారు. తాళాలు వేసిన ఇంటిని లక్ష్యంగా చేసుకొని చోరీలు జరిగాయి. నడికూడి గ్రామంలోని సాయిబాబా గుడి వద్ద కేళావత్ బాలాజీనాయక్ ముగ్గుమిల్లు వ్యాపారి. కుటుంబసభ్యులతో కలిసి మాచర్ల సమీపంలోని కొత్తపుల్లారెడ్డిగూడెం వెళ్లారు. అతని ఇంట్లో అమర్చిన సీసీ కెమెరాలను పగులగొట్టి ఇంటి లోపల వున్న సీసీ కెమెరాల హార్డ్ డిస్క్‌ను కూడా దొంగలు తీసుకెళ్లారు. ఇంట్లోని విలువైన బంగారం, నగదు, ఇతర విలువైన వస్తువులను తీసుకెళ్లారు. బాలాజీనాయక్ ఇంటికి వేసిన తాళాలను పగులగొట్టి దొంగలు తమదగ్గర వున్న తాళాలు ఆ ఇంటికి వేశారు. బాలాజీనాయక్ ఇంటిపక్కన ఉన్న షేక్ రహీం కుటుంబసభ్యులు కూడా హైదరాబాద్ వెళ్లారు. ఆ ఇంట్లో బీరువా పగులగొట్టి వెండి వస్తువులు, విలువైన సామాన్లు చోరీకి గురైనట్లు బాధితులు వివరించారు. నడికూడిలోని మెయిన్ సెంటర్‌లో ఉన్న సయ్యద్ పెద్దసైదా, రైల్వే ఉద్యోగి అప్పారావు ఇళ్లల్లో కూడా చోరీ జరిగింది. శ్రీనివాసపురం గ్రామంలో హరిదాసు రామకృష్ణ, యేపూరి నరసమ్మ ఇంటికి తాళాలు వేసి వుండగా తాళాలు పగులగొట్టి చోరీ చేసినట్లు స్థానికులు పేర్కొన్నారు. శ్రీనివాసపురంలో మరో ఒకటి, రెండు ఇళ్లల్లో చోరీకి ప్రయత్నం చేయగా ఆ ఇంట్లో వున్న వ్యక్తులు లైట్లు వేసి ఎవరు అంటూ పెద్దగా కేకలు వేయడంతో దొంగలు పరారయ్యారు.

అనుమానాస్పద స్థితిలో బావ, బావమరిది మృతి

అచ్చంపేట, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన అచ్చంపేట పంచాయతీ పరిధిలోని చామర్రు బీసీ కాలనీలో మంగళవారం రాత్రి పెనువిషాదం సంభవించింది. చామర్రుకి చెందిన గౌతుకట్ల కోటయ్య అనారోగ్యంతో మృతి చెందగా, మంగళవారం కోటయ్య అంత్యక్రియలు జరిగాయి. దహన సంస్కారాల అనంతరం కోటయ్య పెద్ద కుమారుడు గౌతు కట్ల నాగేశ్వరరావు(45), అతని బావమరిది తెల్లమేకల నాగేశ్వరరావు(36) వాంతులు, విరోచనాలు అయ్యాయి. ఒకరి తర్వాత మరొకరు గంటల వ్యవధిలోనే మంగళవారం రాత్రి మృతి చెందారు. దహన సంస్కారాల సమయంలో వీరిద్దరూ మద్యం తాగినట్లు తెలిసింది. మృతుడు గౌతుకట్ల నాగేశ్వరరావుకు భార్య వెంకాయమ్మ, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. తెల్లమేకల నాగేశ్వరరావు ఎన్‌టీఆర్ జిల్లా చందచర్లపాడు మండలం రామన్నపేటకి చెందిన వాడు. ఇతనికి భార్య పద్మ, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. చామర్రులో పెద్దల సమక్షంలో శవపంచనామా నిర్వహించినట్లు వీఆర్‌వో బాలూనాయక్ తెలిపారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెంకటప్రసాదు తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.15 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	138,147,158
చికెన్ విత్ స్కిన్	264.00
చికెన్ స్కిన్ లెస్	274.00

హోరాహోరీగా జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు

ఈపూరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముప్పాళ్ల గ్రామంలో రైతుమిత్ర కబడ్డీ కమిటీ ఆధ్వర్యంలో జరగుతున్న జాతీయస్థాయి కబడ్డీ పోటీలు నాలుగో రోజు బుధవారం రసవత్తరంగా సాగాయి. పోటీల్లో పలు రాష్ట్రాల నుంచి వచ్చిన జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. ఎస్‌వీఎస్ జట్టుపై హర్యాణా, జార్ఖండ్ జట్టుపై ఇండియా నేవి, సత్తెనపల్లి జట్టుపై ఏపీ స్పై, ఆంధ్రాపై కర్ణాటక, రావిపాడుపై ఇండియా నేవి జట్లు విజయం సాధించాయి. తల్లపనేని రామారావు, సూరే కోటేశ్వరరావు పోటీలను పరిశీలించారు.

అర్ధరాత్రి దొంగలు హల్‌చల్

● ఒకే రోజు 8 గృహాల్లో చోరీ
● పండుగపూట దొంగతనాలతో ప్రజలు బెంబేలు

గురజాలటౌన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): పండుగపూట.. ఒకే రోజు వరుస దొంగతనాలతో దుండగులు హడలెత్తించారు.. తాళాలు వేసి ఉన్న గృహాలను లక్ష్యంగా చేసుకొని చోరీలకు పాల్పడ్డారు. సంక్రాంతి పండుగ రోజైన మంగళవారం అర్ధరాత్రి దొంగలు గురజాల పట్టణంలో 2, మండలంలోని పులిపాడులో 6 గృహాల్లో చోరీలకు పాల్పడ్డారు. పండుగకు తమ గ్రామాలకు, పట్టణాలకు వెళ్లిన వారి గృహాలను లక్ష్యంగా చేసుకొని ఆయా గృహాల్లో చోరీలకు పాల్పడ్డారు. గృహాల్లోని బీరువాలను పగులకొట్టి భారీగా నగదు, వెండి అపహరించారు. గృహాల్లోని సీసీ కెమెరాలను సైతం దుండగులు ధ్వంసం చేశారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు చోరీకి గురైన గృహాల వద్దకు చేరుకొని క్లూస్‌టీం సహాయంతో వివరాలు సేకరించారు. చోరీకి సంబంధించిన వివరాలు తెలియాల్సి ఉంది. పండుగపూట వరుస దొంగతనాలతో మండల ప్రజలు బెంబెలెత్తిపోతున్నారు.

సబ్ డివిజన్ పరిధిలో 15 గృహాల్లో చోరీ : డీఎస్పీ జగదీష్



గురజాల సబ్‌డివిజన్ పరిధిలో మంగళవారం రాత్రి 15 గృహాల్లో చోరీ జరిగినట్లు డీఎస్పీ జగదీష్ తెలిపారు. పట్టణంలోని తన కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మంగళవారం రాత్రి దాచేపల్లి, గురజాల పోలీస్ స్టేషన్ల పరిధిలోని పలు గ్రామాల్లో వరుస దొంగతనాలు జరిగాయన్నారు. సుమారు 15 గృహాల్లో దుండగులు చోరీ చేశారన్నారు. జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు సిబ్బంది పలు బృందాలుగా ఏర్పాటు చేసి విచారణ జరుపుతున్నట్లు చెప్పారు. సంక్రాంతి పండుగకు ఊర్లకు వెళ్లిన వారి గృహాల్లో చోరీలు జరిగాయన్నారు. ప్రజలు పోలీస్ లాక్ మానిటరింగ్ సిస్టంను వినియోగించుకోవాలని, దీని ద్వారా గృహాల్లో లేని సమయంలో పోలీసు నిఘా ఏర్పాటు ఆస్తులను రక్షిస్తామని, దొంగతనాలను అరికడతామని డీఎస్పీ తెలిపారు.

అంగన్వాడీ వర్కర్ కుమారి మృతి

మాచర్ల రూరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక 18వ వార్డుకు చెందిన అంగన్వాడీ వర్కర్ ఎం కుమారి మంగళవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న సీఐటీయూ నేతలు బండ్ల మహేష్, వేముల వెంకట్రావు, అంగన్వాడీ వర్కర్లు కుమారి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

నిఘా నేత్రాలుగా డ్రోన్ కెమెరాలు

సత్తెనపల్లి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : సత్తెనపల్లి సబ్ డివిజన్‌లో నేరాలను తగ్గించేందుకు డ్రోన్ కెమెరాలను ఏర్పాటు చేసినట్టు డీఎస్పీ ఎం హనుమంతరావు బుధవారం తెలిపారు. సత్తెనపల్లి నియోజకవర్గంలోని పట్టణ, గ్రామాల పరిధిలో డ్రోన్ కెమెరాలను ఆపరేట్ చేస్తున్నట్టు తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా, దొంగతనాలు, ఆరు బయట మద్యం సేవించడం, ఘర్షణలకు పాల్పడటం, హత్యలకు పాల్పడటం, స్త్రీలపై లైంగిక దాడులకు పాల్పడటం, ఆస్తి ధ్వంసం చేయడం వంటి కార్యకలాపాలు పెరుగుతున్న నేప థ్యంలో నేరస్తులను త్వరితగతిన గుర్తించేందుకు డ్రోన్ కెమెరాలు ఉపయోగపడతాయన్నారు. పూర్తి స్థాయిలో నేర విచారణ చేసేందుకు, నేరస్తులను చట్టం ముందు నిలబెట్టేందుకు తిరుగు లేని సాక్షాలుగా ఇవి ఉంటాయన్నారు.

జనసేన జెండా ఆవిష్కరణ

వెల్దుర్తి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రచ్చమలపాడులో నూతనంగా ఏర్పాటు చేసిన జనసేన పార్టీ జెండాను ఆపార్టీ నేతలు బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ గ్రామస్థాయిలో పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ సమన్వయకర్త బూసా రామాంజనేయులు, మండల అధ్యక్షుడు గంధం మల్లయ్య, కొమెర లాలుకృష్ణ, దాసరి వినోద్‌కుమార్, కొప్పుల వెంకటరమణ, వెంకటేశ్వరనాయక్ తదితరులు పాల్గొన్నారు.

220 కేవీ సబ్‌స్టేషన్‌ను సందర్శించిన ఈఈ

రెంటచింతల, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : పశర్లపాడు సమీపంలోని 220 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఏపీసీపీడీసీఎల్ ఈఈ ఎన్ సింగయ్య బుధవారం సందర్శించారు. ఈ స్టేషన్‌లో వున్న 132 కేవీకి సంబంధించి పొటెన్షియల్ ట్రాన్స్ ఫార్మర్‌ను పరిశీలించారు.ఈ ట్రాన్స్ ఫార్మర్ నుంచి చెట్టినాడు సిమెంట్‌కు విద్యుత్‌ను సరఫరా చేస్తున్నారు. సాంకేతికపరంగా స్వల్ప మరమ్మతులు చేయించినట్లు సమాచారం. దీంతో, సదరు ఫ్యాక్టరీకి నిరాటంకంగా విద్యుత్ సరఫరా అయ్యేలా వ్యవహరించారు. ఈ ఫ్యాక్టరీ యాజమాన్యం ప్రతి నెలా రూ.3 కోట్ల 7 లక్షలను విద్యుత్ బిల్లుల రూపేణా చెల్లిస్తుంది.

క్యాలెండర్ ఆవిష్కరణ

కారంపూడి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఒప్పిచర్లలోని వేంకటేశ్వరస్వామి కల్యాణ మండపంలో టీడీపీ నూతన సంవత్సర క్యాలెండర్‌ను టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగ కార్యదర్శి పంగులూరి పుల్లయ్య బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాచర్ల నియోజకవర్గ అభివృద్ధికి నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, మాచర్ల శాసనసభ్యుడు జూలకంటి బ్రహ్మానందరెడ్డిలు కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

150 మందికి కంటి వైద్య పరీక్షలు

మాచవరం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : నరసరావుపేట డాక్టర్ రామలింగారెడ్డి కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో స్థానిక షాదీఖానాలో ఉచిత కంటి వైద్య శిబిరం బుధవారం నిర్వహించారు. ఈ శిబిరంలో 150 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించగా వారిలో కొంత మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేసినట్లు వైద్యులు తెలిపారు. ఆరోగ్యశ్రీ, హెల్త్ కార్డులు ఉన్న వారికి ఉచిత రవాణా ప్రయాణంతో పాటు కంటి శస్త్ర చికిత్సలకు తీసుకువెళ్లనున్నట్లు వైద్య బృందం తెలిపింది.

కొనసాగిన కోడిపందేలు

పెదకూరపాడు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : అమరావతి మండలం లోని లేమల్లె, పెదకూరపాడు మండలంలోని ముస్సాపురంలో కోడిపందేలు నిర్వహించారు. అయితే, కోళ్లకు కత్తులు కట్టి నిర్వహించిన ఈ పోటీలు జరుగుతున్న ప్రాంతాలకు పోలీసులు కనుచూపు మేరలో కన్పించలేదు. అధికార పార్టీ గ్రామ స్థాయి నేతలు దగ్గర ఉండి కోడి పందేలను నిర్వహించారు. బరులకు సమీపంలో గుండాటను కూడా ఏర్పాటు చేశారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

నకరికల్లు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి గుంటూరులో చికిత్స పొందుతూ మృతి చెందినట్టు నకరికల్లు పోలీసులు బుధవారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 12వ తేదీ ఆదివారం గుండ్లపల్లి నుంచి నకరికల్లుకు వస్తున్న ఆటో కోతుల గుంపును తప్పించే ప్రయత్నంలో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్‌తో పాటు గుండ్లపల్లికి చెందిన గుత్తికొండ మౌలాలి(74)కి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ మౌలాలిని మొదట నరసరావుపేట వైద్యశాలలో, అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు వైద్యశాలకు తరలించారు. మౌలాలి చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. నకరికల్లు ఎస్ఐ చల్లా సురేష్ కేసును దర్యాప్తు చేస్తున్నారు.

మాజీ మునుసుబు పీరారెడ్డి మృతి

పిడుగురాళ్ల, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): కరాలపాడు మాజీ మునుసుబు బుర్రి పీరారెడ్డి (91) మంగళవారం మృతి చెందారు. మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి పిడుగురాళ్లలో బుర్రి పీరారెడ్డి భౌతికకాయానికి నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు.

వైభవంగా సంక్రాంతి సంబరాలు

సత్తెనపల్లి రూరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి, కనుమ పండుగలను మండల ప్రజలు అత్యంత వైభవంగా జరుపుకున్నారు. మంగళవారం రోజున ప్రజలు తమ గృహాల్లో పొంగళ్ళు పొంగించి దేవతా మూర్తులకు నైవేద్యాలు సమర్పించారు. నూతన వస్త్రాలు ధరించారు. మండలంలోని అబ్బూరులో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముగ్గుల పోటీల్లోని విజేతలకు తెలుగు యువత మాజీ జిల్లా అధ్యక్షుడు మన్నెం శివ నాగమల్లేశ్వరరావు, టీడీపీ నాయకుడు డాక్టర్ వడ్డెంపూడి పవన్‌కుమార్ ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా వ్యవ హరించారు. ఈ పోటీల్లో మొదటి, రెండవ, మూడవ స్థానాల్లో నిలిచిన వారితో పాటు పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో భీమినేని వందనాదేవి, ఎలినీడి లక్ష్మీతులసీ, అబ్బూరి గ్రామ టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తెలుగు మహిళలు పాల్గొన్నారు.

ముప్పాళ్లలో..

ముప్పాళ్ళ, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలో సంక్రాంతి, కనుమ పండుగలను మండల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. వాకిళ్ళ ముందు ముగ్గులు, గొబ్బెమ్మలతో అలంకరించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేర్వేరు ప్రాంతాల్లో నివసిస్తున్న వారు పండుగ సందర్భంగా గ్రామాలకు వచ్చారు. బంధువుల రాకతో ఆయా గ్రామాల్లో సందడి వాతావరణం నెలకుంది.

ముగ్గుల పోటీలు

కారంపూడి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందర్భంగా మండలంలోని ఒప్పిచర్లలోని సత్రం ప్రాంగణంలో మంగళవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. మొదటి బహుమతిని డాక్టర్ కొండపల్లి నాగేశ్వరరావు, రెండో బహుమతిని ఓగూరి బుల్లబ్బాయి, మూడో బహుమతిని కొండపల్లి చిన అప్పారావుకు లభించాయి. ఈ కార్యక్రమంలో కొండపల్లి అమరలింగయ్య, అప్పారావు, కాటంరెడ్డి నాగలక్ష్మిరెడ్డి, యాగంటి లక్ష్మి పాల్గొన్నారు.



ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న నాగమల్లేశ్వరరావు, డాక్టర్ పవన్ కుమార్

గురజాల మండలంలో..

గురజాలటౌన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొట్టిముక్కలలో రావిపాటి రవికుమార్, రొండి పోలురాజు ఆధ్వర్యంలో మంగళవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతలకు సీఐ భాస్కర్, ఎస్ఐ వినోద్‌కుమార్‌లు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో రొండి నాగేంద్రబాబు, పోతురాజు, వెంకటేష్, రాయపాటి అమర్ పాల్గొన్నారు.

రెంటచింతలలో

రెంటచింతల,జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు బుధవారంతో ముగిశాయి.వివిధ ప్రాంతాల్లో వున్న వారంతా గ్రామాలకు చేరుకుని బంధువులు,మిత్రులతో పెద్దపండుగను సంతోషంగా గడిపారు.ఏ ఇంట్లో చూసినా కోలాహలం కనిపించింది.మండలంలోని ప్రతి గ్రామంలో రంగవల్లుల పోటీలు ఆటల పోటీలను నిర్వహించారు.డ్యాన్స్‌బేబీ డ్యాన్స్ పోటీల విజేతలకు బహుమతి ప్రదానం చేశారు.హరిదాసులు గంగిరెద్దుల సందడి కనిపించలేదు.సంప్రదాయ బద్ధంగా మాత్రమే పండుగను జరుపుకున్నారు.

ఆకట్టుకున్న బాల్ బాడ్మింటన్ పోటీలు

నకరికల్లు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పండుగ సందర్భంగా నరసింగపాడులో నిర్వహించిన బాల్ బాడ్మింటన్ పోటీలు క్రీడాకారులను ఆకట్టుకున్నాయి. ఈ పోటీల్లో ప్రథమ బహుమతిని నూర్ బాషా సిద్దయ్య, నూర్ బాషా ఫాజిల్, ద్వితీయ బహుమతిని కాశీ పోతులూరి చారి, సునీల్, తృతీయ బహుమతిని షేక్ మహమ్మద్ జానీ, షేక్ మస్తాన్‌వలి, కన్సోలేషన్ బహుమతికి శ్రీను, ఖాదర్‌లు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విజేతలను నిర్వా హకులు అభినందించారు.

ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు

పిడుగురాళ్ల, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందర్భంగా స్థానిక కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయం ఆవరణలో రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో గెలుపొందిన మహిళలకు అమ్మవారి దేవాలయం కమిటీ అధ్యక్షుడు, రోటరీక్లబ్ అధ్యక్షుడు గుండా అశోక్‌బాబు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రోటరీక్లబ్ సభ్యులు పసుమర్తి సుబ్రహ్మణ్యం, జూలకంటి సుబ్రహ్మణ్యం, నీరుమళ్ల రాజేష్, ఆత్మకూరి గురవయ్య, డాక్టర్ గుర్రం కృష్ణకాంత్, తదితరులు పాల్గొన్నారు.

అమరావతిలో మకరజ్యోతి దర్శనం

అమరావతి, జనవరి 15(ఆంధ్రజ్యోతి) మకర సంక్రాంతి సందర్భంగ మంగళవారం సాయంత్రం స్థానిక గీతామందిరం వద్ద మకరజ్యోతిని వెలిగించి భక్తులకు జ్యోతి దర్శనం కల్పించారు. గత నలభై ఏళ్లగా శబరిమలలో జ్యోతి దర్శనం సమయానికి అమరావతిలో కర్పూరంతో జ్యోతిని వెలిగించడం ఆనవాయితీ. తొలిసారిగా అయ్యప్పమాల ధరించిన మద్ది కామయ్య ఈ జ్యోతి దర్శనం వెలిగించడం ప్రారంభించగా ప్రస్తుతం ఆయన కుటుంబ సభ్యులు మద్ది ధాత్రినారాయణ ఆధ్వర్యంలో మాల ధరించిన మద్ది నగేష్ 20 కేజీల కర్పూరంతో ఏర్పాటు చేసిన జ్యోతిని వెలిగించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జ్యోతి ప్రదక్షిణ చేసి పూజలు నిర్వహించారు.

ఆలయాల్లో ప్రత్యేక అభిషేకాలు

వైభవంగా రథోత్సవం

దుర్గి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి 71వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం స్వామి వారి రథోత్సవం జరిపారు. మేళతాళాలతో రథాన్ని పురవీదుల్లో ఊరేగించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మంగళగిరి సత్యనారాయణశాస్త్రి, అనిల్‌శాసి ప్రత్యేక పూజలు జరిపారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలు, చిన్నారుల కోలాట ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ సుధీర్‌కుమార్‌లు పటిష్ట చర్యలు తీసుకున్నారు.

మాచర్లటౌన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి కల్యాణం మంగళవారం రాత్రి అత్యంత వైభవంగా నిర్వహించారు. చెన్నకేశవస్వామిని పెండ్లి కుమారుడిని చేసి గజారోహణంపై, శ్రీలక్ష్మిని పెండ్లి కుమార్తెగా సూర్యప్రభ వాహనంపై లక్ష్మీదేవి మిద్దెల వద్దకు తీసుకొచ్చి ఎదురుకోలా ఉత్సవం జరిపారు. సింగం బాలకృష్ణ, సుజాత దంపతులు పీటలపై కూర్చున వేద మంత్రోచ్చారణల మధ్య కల్యాణాన్ని వైభవంగా జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఉత్కంఠ వీరభద్ర స్వామికి విశేషాభిషేకాలు

నకరికల్లు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పండుగ సందర్భంగా భద్రకాళి సమేత ఉత్కంఠ వీరభద్ర స్వామి దేవాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్కంఠ వీరభద్ర స్వామికి, కాశీ విశ్వేశ్వరునికి అభిషేకాలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. పూజా కార్యక్రమాలను అర్చక స్వామి ముప్పాళ్ళ విశ్వనాథశాస్త్రి నిర్వహించారు. గుండ్లపల్లిలో భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి దేవాలయంలో భక్తులు సంక్రాంతి పర్వదినాన్ని పురస్క రించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మల్లేశ్వరస్వామిని విశేషంగా అలంకరిం చారు. భక్తులు అధిక సంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు.



క్రోసూరులో వేణుగోపాల స్వామి గ్రామోత్సవం

శ్రీ రంగనాయకస్వామివారి తెప్పోత్సవం

దాచేపల్లి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): వందల సంవత్సరాల చరిత్ర కలిగిన శ్రీదేవి, భూదేవి సమేత రంగనాయక స్వామివారికి ప్రతి ఏటా సంప్రదాయబద్ధంగా నిర్వహించే తెప్పోత్సవంను భక్తులు నిర్వహించారు. స్థానిక ఆలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి వందలాది మంది భక్తులు హాజరయ్యారు. ఆలయ ప్రధాన అర్చకుడు కోసూరి రవికుమార్ వేదపఠనం చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు స్వామివారి కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకుడు రవికుమార్ పాల్గొన్నారు. తక్కెళ్లపాడులో అయ్యప్పస్వామికి భక్తులు సంక్రాంతి పండుగతో అభిషేకాలు నిర్వహించిన అనంతరం తెప్పోత్సవం చేశారు. గామాలపాడు, తక్కెళ్లపాడు, దాచేపల్లి, పెదగార్లపాడు గ్రామాలలో జనసేన ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహు మతులు అందజేశారు.

అయ్యప్పస్వామి దేవాలయంలో పూజలు

పిడుగురాళ్ల, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగరోజున స్థానిక అయ్యప్పస్వామి దేవాలయంలో మకర జ్యోతి దర్శనం, అయ్యప్ప మెట్లపూజ వైభవంగా జరిగింది. దేవాలయ గౌరవాధ్యక్షుడు గుండా శ్రీనివాసరావు, అధ్యక్షుడు అంచూరి శ్రీనివాసరెడ్డిలు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దేవాలయంలో పడిపూజ, అభిషేక పూజా కార్యక్రమాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పూజా కార్యక్రమాలను దేవాలయ అర్చకుడు సతీష్ శర్మ నిర్వహించారు.

క్రోసూరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలో సంక్రాంతి సంబరాలు ఉత్సాహ భరిత మైన వాతావరణంలో వైభవంగా ముగిశాయి. ప్రతి గ్రామంలోనూ సంబరాలు మిన్నంటాయి. ముగ్గుల పోటీలు, పంది వంటల పోటీలు, గొర్రె పొటేళ్ళ పోటీలు, దేవాలయాల్లో ఉత్సవాలు మొదలైనవి నిర్వహించారు. క్రోసూరులో కల్యాణోత్సవం జరుపుకున్న రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి గ్రామోత్సవం మేళ తాళాలతో కన్నుల పండువగా నిర్వహించారు. మంగళవారం సాయంత్రం అయ్యప్పస్వామి దివ్య దర్శనం, జ్యోతి దర్శనంగా ఘనంగా నిర్వహించారు. నరసింహస్వామి దేవాలయంలో గోదా దేవి కల్యాణం వైభవంగా జరిగింది. అనంతవరంలో ముగ్గుల పోటీలు, గొర్రె పొటేళ్ళ పోటీలు నిర్వహించారు. కల్యాణ వెంకటేశ్వర స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఊటుకూరులో వేగుంట రాణి ఆధ్వర్యంలో సం క్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. గ్రామంలో కరెన్సీ నోట్లతో అలంకరించిన హరిదాసు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు. అందుకూరు మాజీ సర్పంచ్ తాళ్ళూరి శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ దిగుమర్తి అప్పారావుల ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు ఉత్సాహంగా జరిగాయి. ఎర్రబాలెంలో ఆటల పోటీలు నిర్వహించారు. 88 తాళ్ళూరులో గ్రామ సంకీర్తన చేశారు. బయ్యవరం, పీసపాడులలో కూడా సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి.

మౌలిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం కృషి



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

వెల్దుర్తి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రమైన వెల్దుర్తిలో రూ. 50 లక్షలతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును మంగళవారం ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. తొలి విడతలో మండలంలో రూ. 2.50 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగు, సాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటోందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కుర్రి శివారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కళ్లం రామాంజిరెడ్డి, జూలకంటి అక్కిరెడ్డి, చిరంజీవిరెడ్డి, చిదంబరం పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

మాచర్ల రూరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లిలో బుధవారం గంట పెద్దిరాజు గుండెపోటుతో, గుండెబోయిన సుబ్బమ్మ అనారోగ్య కారణాలతో మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న శాసనసభ్యుడు జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆ గ్రామానికి వెళ్లి వారి భౌతికకాయాల వద్ద నివాళులర్పించారు. అనంతరం మృతుల కుటుంబసభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మున్నా రాంబాబు యాదవ్, మండల అధ్యక్షుడు నేరేటి వీరాస్వామి యాదవ్, జూలకంటి అక్కిరెడ్డి పాల్గొన్నారు.

మాచర్లటౌన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మెప్మా సహకారంతో స్థానిక చెన్నకేశవస్వామి దేవాలయం వద్ద ఏర్పాటు చేసి ఫ్యాన్సీ స్టోర్, బ్యాంకింగ్ ఆన్‌లైన్ సేవలను గురువారం ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి ప్రారంభించనున్నారు. పురపాలక సంఘ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సర్వీస్ ప్రొవైడర్స్ మేళా, రిజిస్ట్రేషన్ ప్రారంభోత్సవంలో పాల్గొననున్నారు.

నడిగడ్డ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు

పెదకూరపాడు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : నియోజక వర్గ కేంద్రమైన పెదకూరపాడులో నడిగడ్డ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో మహాలక్ష్మమ్మ చెట్టు పంచాయతీ ఆఫీసు సమీపంలో మంగళవారం రాత్రి ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నడిగడ్డ ఫ్రెండ్ సర్కిల్ ప్రతినిధులు మాట్లాడుతూ సంక్రాంత్రి పండుగ విశిష్టతను తెలియజేయడమే లక్ష్యంగా ఈ పోటీలను నిర్వహించినట్టు చెప్పారు. ప్రథమ స్థానంలో నిలిచిన పానుగంటి దుర్గకు రూ.10 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన కే శిరీషకు రూ.7 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన ఎస్ నాగధరణికి రూ. 5 వేలను నడిగడ్డ ఫ్రెండ్ సర్కిల్ బృందం అందించారు. ఈ ముగ్గుల పోటీల్లో పాల్గొన్న 46 మందికి ప్రోత్సాహక బహుమతులను నిర్వాహకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ గ్రామ పార్టీ అధ్యక్షుడు చెన్నుపాటి బుల్లిబాబు, పాల ఉత్పత్తి దారుల సహకార సంఘం మాజీ ఉపాధ్యక్షుడు జవ్వాజి రాంబాబు, నాదెండ్ల బాబు, జవ్వాజి సతీష్, శాఖమూరి శ్రీను, మన్నవ నాని, జాగర్లమూడి రాజేష్, మన్నవ శ్రీహరి పాల్గొన్నారు.

పాఠశాలకు చేయూత

పెదకూరపాడు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో క్రాఫ్ట్ టీచరుగా ఉద్యోగ బాధ్యతలు నిర్వహించిన గంగాధరరావు జ్ఞాపకార్థం ఆయన భార్య భారతీ బీరువా, కుర్చీలు అందజేయడం అభినందనీయమని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కాకాణి వెంకటరమణ అన్నారు. రూ.51 వేలతో సమకూర్చిన భారతీ సమ కూర్చిన బీరువా, కుర్చీలు, కళా వేదిక పై మ్యాట్, కర్టెన్స్‌ను హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడుకి 1989 - 90 బ్యాచ్ పూర్వ విద్యార్థులు అందజేశారు.

ఉద్యోగాల పేరిట మోసం.. వ్యక్తి అరెస్టు

సత్తెనపల్లి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో రాజకీయ నాయకుల పేర్లు చెప్పి ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం చేసిన వ్యక్తిని అరెస్టు చేసినట్టు పట్టణ సీఐ బ్రహ్మయ్య తెలిపారు. పట్టణ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, చిత్తూరు జిల్లా తప్పన్నగారిపల్లికి చెందిన అమాస భాను చెడు వ్యసనాలకు అలవాటుపడ్డాడు. గతంలో రాజకీయనాయకుల దగ్గర వీఆర్‌వోగా పని చేశానని, చాలా మంది నాయకులు తనకు తెలుసునని, ఆ పలుకుబడితో ఉద్యోగాలు ఇప్పిస్తానని పలువురిని నమ్మించి మోసం చేశాడు. అతనిపై చిత్తూరు జిల్లాలో పలు కేసులు నమోదయ్యాయి. హాత్యాయత్నం కేసులో కూడా చిత్తూరు జిల్లా సోమ్లా పోలీసులు అతన్ని జైలుకు కూడా పంపారు. ఆ తర్వాత బెయిల్‌పై బయటకు వచ్చిన అతనిలో ఎలాంటి మార్పు రాలేదు. గతంలో మాదిరిగానే ఉద్యోగాల పేరిట మోసం చేసేవాడు. ఈ క్రమంలో భానుకి నాగ మల్లేశ్వరరావుతో పరిచయం ఏర్పడింది. నాగమల్లేశ్వరరావు సహకారంతో సత్తెనపల్లి నియోజక వర్గంలోని పొలిటికల్ వాట్సప్ గ్రూపుల్లో ఉన్న సభ్యుల ఫోన్ నంబర్లు సేకరించాడు. వీరిని మోసం చేయడం ప్రారంభించాడు. రాజమండ్రి, తిరుపతి, రేణిగుంట ఎయిర్ పోర్టుల్లో ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మబలికి ఫోన్ పే ద్వారా ఆయా వ్యక్తుల నుంచి డబ్బులు వేయించుకున్నాడు. సత్తెనపల్లి నియోజకవర్గంలో ధూళిపాళ్ళ, రాజుపాలెం, చాగంటివారిపాలెం గ్రామాలకు చెందిన వ్యక్తులను కూడా ఈ తరహాలో మోసం చేశాడు. మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ ఆతుకూరి నాగేశ్వరరావు ఫిర్యాదు మేరకు ఇతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు. దర్యాప్తులో భాగంగా భానుని అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచినట్టు తెలిపారు.

హోంగార్డు సుభానికి ఉత్తమ సేవా అవార్డు

ముప్పాళ్ళ, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముప్పాళ్ళకు చెందిన హోంగార్డు , వివాదారహితుడు షేక్ సాతులూరి సుభాని, గత పదహారేళ్లుగా ముప్పాళ్ళల్లో చలివేంద్రం నిర్వహిస్తూ ప్రజలకు సేవలు అందిస్తున్నారు. ఎస్పీ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో ఎస్పీ చేతుతమాదుగా ఉత్తమ హోంగారు అవార్డును సుభానీ అందుకున్నారు.

క్రికెట్ టోర్నమెంట్ విజేత రమేష్ సీసీ టీం

దుర్గి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రాంగణంలో నిర్వహించిన ఓపెన్ క్రికెట్ టోర్నమెంట్ బుధవారంతో ముగిసింది. మండల కేంద్రమైన దుర్గిలోని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వార్షిక మహోత్సవాన్ని పురస్కరించుకుని ఈ టోర్నమెంట్ నిర్వహించారు. ఫైనల్స్‌లో దుర్గికి చెందిన రమేష్ సీసీ టీం మాచర్ల పెద్దారెడ్డి టీంపై గెలుపొంది రూ. 30 వేల నగదు బహుమతితోపాటు షీల్డ్ అందుకున్నారు. రమేష్ సీసీ బౌలర్ కోఫూరి అశోక్ రెండు ఓవర్లు బౌలింగ్ చేసి ఏడు పరుగులిచ్చి రెండు వికెట్లు తీసి గెలుపులో కీలక ప్రాత పోషించారు. రన్నరప్‌గా నిలిచిన పెద్దారెడ్డి టీం రూ. 20 వేల నగదు బహుమతి పొందింది.

మండలంలోని అడిగొప్పుల శ్రీలక్ష్మి అమ్మవారి టీం మూడో బహుమతి రూ. 10 వేలు అందుకున్నారు. ఆల్‌రౌండర్‌గా అనిల్, బెస్ట్ బౌలర్‌గా ఆరీఫ్, బెస్ట్ బ్యాట్స్‌మెన్‌గా క్రాంతి, మ్యాన్‌ఆఫ్‌ది సిరీస్‌గా చింతా శివ నిలిచారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఎల్ఐ వీ గోపాల్, జీ చిన వెంకటేశ్వర్లు, జీ శివ, గోపాలరావు, శ్రీపతి బాబు, నారాయణ పున్నయ్య ఆర్ రవి, సీహెచ్ సత్యనారాయణ పాల్గొన్నారు.

కడుపునొప్పి తాళ్లలేక విద్యార్థి ఆత్మహత్య

మాచర్ల రూరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): కడుపునొప్పి భరించలేక విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని రాయవరంలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రావులపల్లి అమరలింగేశ్వరావు (17) స్థానిక ఆర్‌సీఎం జూబ్లీ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్నాడు. కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. పండుగ సెలవులు ఇవ్వడంతో, ఈ నెల 13న భోగి పండుగ రోజున హైస్కూల్‌కు వెళ్లి అక్క ఎలుకల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. ఈ విషయం గమనించిన గ్రామస్తులు విద్యార్థి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. మాచర్లలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి అతన్ని తరలించారు. అమరలింగేశ్వరరావు పరిస్థితి విషమంగా ఉండడంతో నరసరావుపేటలోని మహాత్మా గాంధీ వైద్యశాలకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మాచర్ల రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

లెప్రసీ కాలనీలో నిత్యావసరాల అందజేత

మాచర్లటౌన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందర్భంగా రోటరీక్లబ్ ఆఫ్ మాచర్ల, లవ్ అండ్ ఆఫ్ ఆనంద విహారి గ్రూప్, పల్స్ పోలియో ప్రోగ్రాం గ్రూపు సంయుక్తంగా బుధవారం పట్టణంలోని లెప్రసీ కాలనీలో పేదలకు 300 కేజీల బియ్యం, 50 కేజీల కందిపప్పు అందించారు. ప్రజలంతా సంతోషంగా పండుగ జరుపుకోవాలనే ఉద్దేశ్యంతో ఈ సేవా కార్యక్రమం నిర్వహించినట్లు వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షురాలు కొండవీటి కృష్ణకుమారి, సెక్రటరీ నిమ్మగడ్డ సురేఖ, డిప్యూటి గవర్నర్ కొండవీటి రామకోటయ్య, ఇక్కుర్తి శంకర్, తుమ్మల సత్యప్రసాద్, ఆలేటి కోటేశ్వరరావు, సాంబశివరావు, మస్తాన్‌వలి, పఠాన్ నాగూర్‌వలి తదితరులు పాల్గొన్నారు.

దుర్గిలో జనసేన ఫ్లెక్సీ చించివేత.. కేసు నమోదు

దుర్గి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన దుర్గిలో సంక్రాంతి పండుగ సందర్భంగా జనసేన నేతలు స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ ఎదురుగా ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. బుధవారం ఈ ఫ్లెక్సీ చిరిగిపోయి ఉండడాన్ని గుర్తించిన జనసేన దుర్గి పట్టణ అధ్యక్షుడు రుద్రాల రవి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్ఐ సుధీర్‌కుమార్ కేసు నమోదు చేసి విచారణ చేశారు. దుర్గికి చెందిన కాసిబోయిన బాలసైదులుని నిందితుడిగా గుర్తించారు. అతడిని అదుపులోకి తీసుకున్నారు. అతను మద్యం మత్తులో ఆ ఫ్లెక్సీపై అతను పడిపోవడంతో అది చిరిగిపోయిందని, ఉద్దేశపూర్వకంగా చేయలేదని ఎస్ఐ సుధీర్‌కుమార్ తెలిపారు.

రెండు ద్విచక్రవాహనాలు ఢీ

నలుగురికి గాయాలు .. ఒకరి పరిస్థితి విషమం

రెంటచింతల, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్రవాహనాలు ఢీ కొన్న సంఘటనలో నలుగురు గాయపడగా, అందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన మండలంలోని తుమృకోట గ్రామం తిమ్మాయికుంట సమీపంలో మంగళవారం మధ్యాహ్నం జరిగింది. హెడ్‌కానిస్టేబుల్ తిరుపాల్ తెలిపిన వివరాలు.. సంక్రాంతి పండుగ సందర్భంగా తన కూతురు సీత ఆహ్వానం మేరకు గురజాల మండలం దైదకి చెందిన అమరలింగయ్య తుమృకోటకు వచ్చారు. తిరుగు ప్రయాణంలో ఎన్ విష్ణువర్ధన్ ద్విచక్ర వాహనంపై పాలువాయి జంక్షన్‌కు వస్తున్నాడు. ఇదే సమయంలో షేక్ బాబర్ వలి,రహమాన్‌ల ద్విచక్ర వాహనం ఎదురుగా వస్తోంది. ఎదురెదరుగా వస్తున్న ఈ రెండు వాహనాలు ఢీ కొన్నాయి. ఈ ఘటనలో నలుగురు గాయపడ్డారు. వారిలో అమరలింగయ్య తలకు, కాలికి తీవ్రగాయాలయ్యాయి. మాచర్ల ఆసుపత్రికి అక్కడి నుంచి మెరుగైన చికిత్సం కోసం గుంటూరు ఆసుపత్రికి ఆయన తరలించారు. కుమార్తె సీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తిరుపాల్ చెప్పారు.

ప్రభుత్వ స్థలంపై వివాదం

పిడుగురాళ్ల, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): కొండమోడు సమీపంలోని మేరీమాత విగ్రహం వద్ద వున్న ప్రభుత్వ భూమి ఇప్పటికే కొందరి ఆక్రమణలో ఉంది. అయితే, ఇప్పుడు మరికొంత మంది ఆ భూమిపై తమకు హక్కులు ఉన్నాయంటూ తెరపైకి వచ్చారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ స్థలంలో ఉన్న తాత్కాలిక రేకులషెడ్డును రెండు రోజుల క్రితం కొందరు వ్యక్తులు కూల్చివేశారు. దీనిపై ఆనంద్ అనే వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. 2015-18 మధ్య కాలంలో ఆ భూమిని రెవెన్యూ అధికారులు చుక్కల భూమిగా గుర్తించి ఆక్రమించిన వారిపై చర్యలుంటాయంటూ హెచ్చరిక బోర్డును అప్పటి రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేశారు. 2019 తరువాత కొందరు బోర్డును పక్కన పడేసి ఆ స్థలంలో తాత్కాలిక కట్టడాలకు అప్పటి తహసీల్దార్ భాస్కరరావు ప్రోత్సాహంతోనే జరిగాయనే ఆరోపణలు వున్నాయి. ప్రభుత్వ భూమి అయినప్పటికీ కొంతమంది వ్యక్తులు తమకు హక్కులు ఉన్నాయన్న పరస్పర ఫిర్యా దుల నేపథ్యంలో కొన్నేళ్ల కిందటే కొందరు కోర్టును ఆశ్రయించారు.

గుత్తికొండలో సంక్రాంతి సంబరాలు

పిడుగురాళ్ల, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): గుత్తికొండ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది సంక్రాంతి రోజున పొరుగు ఊర్లలో వున్న వారంతా ఒకే వేదికకు చేరుకుంటారు. ముగ్గుల పోటీలు, క్రికెట్ పోటీలు, డాన్స్ బేబి డాన్స్ వంటి కార్యక్రమాలతో గ్రామస్తులంతా సందడి చేశారు. స్థానిక జడ్పి హైస్కూల్‌లో అందరూ ఒకేచోట హాజరై పండుగ విశేషాలు, గ్రామాభి వృద్ధికి తీసుకోవాల్సిన అంశాలపై చర్చించారు. పార్టీలకు అతీతంగా సంక్రాంతి రోజున అం దరూ కలిసి ఒకేచోట హాజరవుతూ వుంటారు. మహిళలకు ముగ్గుల పోటీలు, యువతకు క్రికెట్ పోటీలు, చిన్నారులకు డాన్స్ బేబీ డాన్స్ వంటి కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి గ్రామ కమిటీ సభ్యులు బహుమతులు అందజేశారు.

సంతూరు ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు

మాచవరం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి సందర్భంగా సంతూరు కంపెనీ ఆధ్వ ర్యంలో పిల్లుట్లలోని కాశీవిశ్వేశ్వర స్వామి దేవాలయంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. స్థానిక డిస్ట్రిబ్యూటర్ చిట్టిప్రోలు గురవయ్య ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి. మొదటి బహుమతిని చౌదరి చంద్ర మౌనిక, రెండవ బహుమతిని గద్దె కల్యాణి , మూడో బహుమతిని మల్లా తిరుపతమ్మకు, నాల్గో బహుమతిని పలిశెట్టి మల్లిక కైవసం చేసుకున్నారు. అదే విధంగా మాచవరంలోని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించి గెలు పొందిన విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ఆయా కార్యక్రమాల్లో పిల్లుట్ల సర్పంచ్ లఘుమవరపు శివపార్వతి సాంబశివరావు, రాష్ట్ర ఆర్యవైశ్య యూత్ ఉపాధ్యక్షుడు చిట్టిప్రోలు నరసింహారావు, చిట్టిప్రోలు గురవయ్య పాల్గొన్నారు.

ఉత్తమ ఎస్ఐగా సమందర్‌వలి

వెల్దుర్తి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉత్తమ ఇన్విస్టిగేషన్ ఆఫీసర్‌గా ఎస్ఐ సమందర్‌వలి ఎంపికయ్యారు. జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో మంగళవారం ఎస్పీ శ్రీనివాసరావు చేతుల మీదుగా ఈ అవార్డును ఆయన అందుకున్నారు. స్టేషన్ సిబ్బందితోపాటు నేతలు ఎస్ఐ సమందర్‌వలికి అభినందనలు తెలిపారు.

అమరేశ్వరాలయంలో గోమాతకు ప్రత్యేక పూజలు

అమరావతి, జనవరి 15(ఆంధ్రజ్యోతి): సంక్రాతి పర్వదినాలలో కనుమ సందర్భంగా బుధవారం స్థానిక బాలచాముండికా సమేత అమరేశ్వరాలయంలో గోమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థాన సహాయ కమిషనర్, ఈఓ వీ సునీల్‌కుమార్ , ఆలయ ప్రధానార్చకుడు సుధీర్ శర్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గోవుకు వేదపండితులు, అర్చకులు పూజ, ప్రదక్షిణాలు చేశారు.

18న ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా రక్తదాన శిబిరం

వినుకొండ, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు వర్ధంతి సందర్భంగా ఈ నెల 18వ తేదీన నరసరావుపేట రోడ్డులోని గంగినేని కల్యాణ మండపంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు లెజెండరీ బ్లెడ్ డొనేషన్ డ్రైవ్ నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఒక్కరు రక్తదానం చేసి ప్రాణపాయంలో ఉన్న వారికి కొత్త జీవితాన్ని అందించాలని ఈ సందర్భంగా వారు సూచించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిధులుగా ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు పాల్గొననున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

ఏసుపాదం మాస్టారు బోధనతో ఉజ్వల భవిష్యత్తు

● జక్కిరెడ్డి శ్రీనివాసరెడ్డి

నూజెండ్ల, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ఏసుపాదం మాస్టారు చేసిన విద్యా బోధనతో నేడు కంభంపాడు యువకుల ఉజ్వల భవిష్యత్తుకు దోహదపడ్డాయని ఏసుపాదం మాస్టార్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు జక్కిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఏసుపాదం మాస్టారు 13వ వర్ధంతి సందర్భంగా మంగళవారం ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. గత సంవత్సరం 10వ తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ సాధించిన పూర్ణ సాయి, మహేశ్వరి, గాజుల లక్ష్మీదుర్గ, కట్టెంపూడి పవిత్ర, సీహెచ్ సుస్మిత, రాహుల్, వెంకట లక్ష్మిలకు నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా కిసాన్ మహా సభ రాష్ట్ర అధ్యక్షుడు తోట ఆంజనేయులు, తోట శ్రీనివాసరావు, పసుపులేటి కొండలు, ఏసుపాదం మాస్టారు కుమారుడు సంకూరు బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి గణతంత్ర దినోత్సవాలకు ఎన్ఈసీ ఎన్‌సీసీ క్యాడెట్లు

నరసరావుపేట రూరల్, జనవరి 15: నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్స్ రాష్ట్రస్థాయి గణతంత్ర దినోత్సవాలకు ఎంపికైనట్లు కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు బుధవారం తెలిపారు. కళాశాలకు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్లు కె. హరీష్, కె.కావేరి, ఏ.ఆర్తి, డి.అప్పలనాయుడు లు రాష్ట్రస్థాయి గణతంత్ర దినోత్సవాలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు, వైస్ చైర్మన్ మిట్టపల్లి చక్రవర్తి, కళాశాల సెక్రటరీ మిట్టపల్లి రమేష్‌లు కళాశాలలో ఎన్‌సీసీ క్యాడెట్స్‌ను అభినందించారు.

మాజీ ఉప సర్పంచ్ పెదముసలయ్య మృతి

యడ్లపాడు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): యడ్లపాడు గ్రామ మాజీ ఉప సర్పంచ్ కారుచోల పెదముసలయ్య (77) అనారోగ్యంతో బుధవారం ఉదయం మృతిచెందాడు. దీర్ఘకాలం సీపీఎం అభిమానిగా కొనసాగిన ఆయన 1989 నుంచి 1994 వరకు యడ్లపాడు గ్రామ ఉపసర్పంచ్‌గా వ్యవహరించారు. కొద్దిరోజులుగా అనారోగ్యంతో జీజీహెచ్‌లో చికిత్సపొంది ఆదివారం గ్రామానికి వచ్చిన ఆయన బుధవారం తెల్లవారుజామున మృతిచెందాడు. పెద ముసలయ్య మృతి విషయం తెలుసుకున్న పలు పార్టీల నాయకులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, సీపీఎం నాయకులు పోపూరి సుబ్బారావు, కారుచోల రోశయ్య, జరుగుల శంకరం, నూతలపాటి కాళిదాసు, టీడీపీ నాయకులు పోపూరి రాఘవయ్య, వెంకటరత్తయ్య, ప్రజా సంఘాల నాయకులు ఉన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

నరసరావుపేట రూరల్, జనవరి 15: (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోటబజారు పులుపులవారి వీధిలోని వీరాంజనేయ సహిత యోగా లక్ష్మీనరసింహస్వామి ఆలయ నూతన రాతి నిర్మాణం కోసం విరాళం అందజేశారు. పట్టణానికి చెందిన పంచాయతీరాజ్ శాఖ ఏఈ బేతంచెర్ల వెంకటనాగేశ్వరరావు, ధనలక్ష్మి దంపతులు, వారి సోదరులు బేతంచర్ల వెంకట శివప్రసాద్, ఉషారాణి దంపతులు ఆలయ కమిటీ సభ్యులకు రూ.1,01,116లను అందజేశారు.

ఘనంగా మాయావతి జన్మదిన వేడుకలు

వినుకొండ, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): బీఎస్పీ అధినేత్రి, మాజీ ముఖ్యమంత్రి మాయావతి జన్మదినం సందర్భంగా స్థానిక బీఎస్పీ ఆధ్వర్యంలో పట్టణంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని అంబేద్కర్ విగ్రహాలకు నేరెళ్లరాజు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం భారీ కేక్ కట్‌చేసి కార్యకర్తలకు పంపిణీచేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుంటుంది: మక్కెన

వినుకొండ టౌన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అందుగులకొత్తపాలెం సమీపంలో ఆర్టీసీ బస్సు ఢీకొని మృతిచెందిన కుర్రా తిరుపతయ్య మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వ వైద్యశాలలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు మంగళవారం సందర్శించి ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన తోపాటు 40గొర్రెలు మరణించడం ఎంతో బాధాకరంగా ఉందని, వారికి ప్రభుత్వం నుంచి రావల్సిన ఆర్థికసాయం ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు సాయంతో అందేలా చూస్తామన్నారు.

నేడు రామయోగి స్వామి తిరునాళ్ళ

నూజెండ్ల, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం నూజెండ్లలో శ్రీరామయోగి స్వామి తిరునాళ్ళ గురువారం వైభవంగా జరగనున్నది. తిరునాళ్ళను పురస్కరించుకొని గ్రామస్థులు మూడు భారీ విద్యుత్ ప్రభలను నిర్మించారు. సాంస్కృతిక కార్యక్రమాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. యోగయ్య స్వామి పాదులకు భక్తులు బుధవారం జలాభిషేకం నిర్వహించారు. ఎస్ఐ టీవీ కృష్ణారావు సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు.

వైభవంగా సంక్రాంతి సంబరాలు



సంక్రాంతి సంబరాల్లో జరిగి పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తదితరులు

నరసరావుపేట, లీగల్ జనవరి 15: నరసరావుపేట ఎస్పీ కార్యాలయ ఆవరణలో సంప్రదాయబద్ధంగా సంక్రాంతి సంబరాలు పోలీసులు జరుపుకున్నారు. సంబరాల్లో ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సంక్రాంతి భారతీయ సంప్రదాయంలో ఒక ముఖ్యమైన పండుగ అన్నారు. పల్నాడు జిల్లాలో వివిధ విభాగాల్లో విశేష ప్రతిభ కనబరిచిన పోలీస్ సిబ్బందికి ప్రశంసా పత్రాలను అందజేశారు.

● బొల్లాపల్లి: మండలంలోని సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామాల్లో ముగ్గుల పోటీలు, పతంగులు, మ్యూజికల్ చైర్లు, వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. బుధవారం కనుమ కావటంతో రైతులు పశువులకు, ఆవులకు పూజలు, గో ప్రదక్షణలు చేశారు.

● రొంపిచర్ల: మండలంలోని గ్రామాల్లో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని మంగళవారం ఆలయాల్లో పూజా కార్యక్రమాలను నిర్వహించారు. రొంపిచర్లలోని శంకరస్వామి, వాసవి, సీతారామ స్వామి, వడమూడివారిపాలెంలో నీల కంఠేశ్వర స్వామి, విప్పర్లలోని వల్లభేశ్వర స్వామి, సంతగుడిపాడు, గోగులపాడు గ్రామాల్లోని వెంకటేశ్వరస్వామి, చంద్రమౌళేశ్వర స్వామి ఆలయాలతో పాటు మిగిలిన ఆలయాల్లో పూజా కార్యక్రమాలను నిర్వహించారు. రొంపిచర్లలోని శంకర స్వామి, మదన వేనుగోపాల స్వామి ఉత్సవ విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహించారు. మండలంలోని గ్రామాల్లో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని మంగళవారం పలు పోటీలను నిర్వహించారు. రొంపిచర్ల, ఆరేపల్లి, కొత్తపల్లి తదితర గ్రామాల్లో ముగ్గులు, డ్యాన్స్, తాడులాగు పోటీలు, స్లో సైక్లింగ్ తదితర పోటీలు జరిగాయి. రొంపిచర్లలోని పడమటిపాలెం, రాజుల బజారులో కాకతీయ యూత్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. కొనకంచివారిపాలెంలో సంక్రాంతి పర్వదినం సందర్భంగా గాయత్రి హోమాన్ని మంగళవారం నిర్వహించారు. గాయత్రీ పరివార్ పల్నాడు జిల్లా కన్వీనర్ పేరిశాస్త్రి పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

● యడ్లపాడు: మండలంలోని లింగారావుపాలెం, జాలాది గ్రామాలలో దేవతామూర్తుల తెప్పోత్సవ కార్యక్రమాన్ని మంగళవారం కన్నుల పండువగా నిర్వహించారు. ప్రతి ఏటా సంక్రాంతి పండుగ రోజున గోదాదేవి కల్యాణం అనంతరం తెప్పోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. లింగారావుపాలెంలోని పార్వతీసమేత మల్లికార్జున స్వామి, సీతారామస్వామి ఆలయాలలోని ఉత్సవమూర్తులను గ్రామం మధ్య గల చెరువులోను, వేరొక చెరువులో జాలాది హరిహర దత్తక్షేత్రంలోని సీతారామ స్వామి ఉత్సవమూర్తుల తెప్పోత్సవం నిర్వహించారు.

● నరసరావుపేట టౌన్: పట్టణంలోని హరిహర షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలో సోమవారం సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముగ్గుల పోటీలలో 135మంది పాల్గొన్నారు. మొదటి బహుమతి పమిడి గౌతమి, రెండో బహుమతి పాపన సుజాత, మూడో బహుమతి బాపతు లావణ్య గెలుపొందారు, విజేతలకు రూ.7500లు, రూ.5000లు, రూ.3300లు నగదు బహుమతులను అందజేశారు. విజేతలకు బహుమతులను డాక్టర్ చదలవాడ అరవిందబాబు అందజేశారు. ఈ సందర్భంగా తోట వెంకట దీప్తి శ్రేయ, పోతుగంటి శరణ్యల కూచిపూడి నృత్య ప్రదర్శన, పీ రవికుమార్ ఆలపించిన గీతాలు అలరించాయి.



వెల్లటూరులో గంగిరెద్దు సందడి, మకరజ్యోతిని వెలిగిస్తున్న మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, ఆలయ చైర్మన్ చిన్నగుర్నాథం తదితరులు

● వినుకొండ: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని మండలంలోని విఠంరాజుపల్లి గ్రామ సమీపంలోని సాయిబాబా గుడివద్ద ఏర్పాటుచేసిన క్రికెట్ పోటీలు గత 15రోజులుగా యువత నిర్వహించారు.కార్యక్రమంలో భవనం పేరిరెడ్డి, రోటరీక్లబ్ ఆఫ్ గ్రేటర్ వినుకొండ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డిలతోపాటు నిర్వాహకులు శివారెడ్డి, జానారెడ్డి పాల్గొన్నారు.

● వినుకొండ: మకరజ్యోతి సందర్భంగా పట్టణంలోని మార్కాపురం రోడ్డులోని అయ్యప్పస్వామి దేవాలయంలో భక్తులు మంగళవారం ఘనంగా పూజలు నిర్వహించారు. మకరజ్యోతి ప్రజ్వలన కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, ఆలయ చైర్మన్ గుడివాడ చిన్నగుర్నాథం ప్రారంభించారు.

● చిలకలూరిపేట: స్థానిక సుభానీనగర్ నాగేంద్ర స్వామి పుట్ట దగ్గర ఉన్న అయ్యప్పస్వామి వారి దేవస్థానంలో మంగళవారం మకర సంక్రాంతిని పురస్కరించుకుని 216 కిలోల ఆవునేతితో అఖండ జ్యోతి ప్రజ్వలన కార్యక్రమాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. కోటప్పకొండ వేద పాఠశాల రిటైర్డు పిన్సిపాల్ బ్రహ్మశ్రీ మార్తి వెంకటరామశర్మ, విజయవాడ దుర్గా నాగమల్లేశ్వరి దేవస్థాన ఆస్థాన సిద్ధాంతి చల్లా శ్రీనివాసశర్మ, డాక్టర్ ఎస్ఎస్‌వీ రమణ, అంబటిపూడి వెంకటసాయి మణిదీప్‌శర్మ, చెమిటిగంటి సాయిరాం శర్మ, గుండెపూడి చంద్రశేఖర్ శర్మ (అవధాని), అంబటిపూడి రాజేష్‌శర్మ మకర జ్యోతి ప్రజ్వలన చేశారు. కార్యక్రమంలో దేవస్థానం గౌరవ అధ్యక్షుడు సీహెచ్‌వీహెచ్ విజయకుమార్, అధ్యక్షుడు అంబటిపూడి వెంకటేశ్వర శాస్త్రి, కార్యదర్శి నర్రా కాళిదాసు తదితరులు పాల్గొన్నారు.

● యడ్లపాడు: మండలంలోని ఆలయాల్లో పూజలు నిర్వహించి సాయంత్రం గ్రామాల్లో దేవతా మూర్తులకు గ్రామోత్సవం నిర్వహించారు. యడ్లపాడులో సినీ, టీవీ నటుడు, పుడమి బిల్డర్స్ అధినేత ముత్తవరపు సురేష్‌బాబు ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. రచ్చబండ వద్ద ముగ్గుల పోటీలు, మ్యూజికల్ చైర్స్‌తోపాటు పలు పోటీలు నిర్వహించి విలువైన బహుమతులను అందజేశారు. లింగారావుపాలెంలో డీవైఎఫ్ఐ 45వ క్రీడా, సాంస్కృతిక ఉత్సవాలను మూడు రోజులపాటు ఘనంగా నిర్వహించారు. చెంఘీజ్‌ఖాన్‌పేటలో ట్రాక్టర్ రివర్స్ పోటీలను ఇర్వహించారు.

● సంక్రాంతి పండుగ సందర్భంగా మండలంలోని సంగంగోపాలపురం గ్రామ పరిధిలో జోరుగా కోడి పందాలు నిర్వహించారు. మండల టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ ఆధ్వర్యంలో ఈ పందేలు నిర్వహించగా వందల సంఖ్యలో పందెం రాయుళ్ళు పందేలలో పాల్గొన్నారు.

● నాదెండ్ల: మండలంలోని పలు గ్రామాల్లో సంక్రాంతి పండుగ సందర్భంగా దేవతా మూర్తుల విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహించారు. సాతులూరులో కాకతీయ ఉత్సవ కమిటీ, హైకోర్టు న్యాయవాది నర్రా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పలు పోటీలు నిర్వహించారు. విజేతలకు ముఖ్య అతిథిగా పాల్గొన్న నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తదితరులు బుధవారం రాత్రి బహుమతులు అందజేశారు.

● నరసరావుపేట రూరల్: మండలంలోని ఇసప్పాలెంలోని మహంకాళి అమ్మవారి ఆలయంలో కనుమ పండుగ పురస్కరించుకుని గోపూజ ఘనంగా నిర్వహించారు. ఆలయ అభివృద్ధి అధికారి మాధవీదేవి, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

● రొంపిచర్ల: మండలంలోని కొనకంచివారిపాలెంలో సంక్రాంతి పర్వదినం సందర్భంగా కోడి పందాలను నిర్వహించారు. రొంపిచర్ల మండలంతోపాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు పందాలను తిలకించేందుకు భారీ సంఖ్యలో విచ్చేశారు. లక్షల్లో పందాలను పందెం కోళ్ళపై కాశారు. రాత్రిపూట ఫ్లడ్ లైట్లను ఏర్పాటుచేసి పందాలను ఏర్పాటుచేశారు.

● ఈపూరు: మండలంలోని ముప్పాళ్ళ గ్రామంలో నందమూరి బసవ తారకరామారావు మెమోరియల్, శివశక్తి లీలా అండ్ అంజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం రాష్ట్రస్థాయి ముగ్గులు పోటీలు నిర్వహించారు. విజేతలకు జీవీ ఆంజనేయులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి రాపర్ల జగ్గారావు, మండల పార్టీ అధ్యక్షుడు తిరుమలశెట్టి బాలయ్య, అయినాల కోటేశ్వరరావు పాల్గొన్నారు.

● నూజెండ్ల: మండలంలో సంక్రాంతి, కనుమ పండుగల సందర్భంగా ఏర్పాటుచేసిన క్రికెట్, వాలీబాల్, ముగ్గుల పోటీల్లో యువత, మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. నూజెండ్ల జడ్పీ పాఠశాలలో జరిగిన వాలీబాల్ పోటీల్లో కంభంపాడు జట్టు మొదటి స్థానం, నూజెండ్ల జట్లు రెండు, మూడవ స్థానాలు గెలుచుకున్నాయి. గెలుపొందిన జట్లకు మాజీ డీఎల్‌డీఏ చైర్మన్ లగడపాటి వెంకటరావు, సర్పంచ్ వీర్ల వెంకట స్వామి, దేవాబత్తుని సాంబయ్య, కుమార స్వామి తదితరులు బహుమతులు అందజేశారు. పాతరెడ్డిపాలెం గ్రామంలో ఫ్యూచర్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా ముగ్గుల పోటీలను ఉపాధ్యాయుడు, రచయిత రావులపల్లి పుల్లారావు ఆధ్వర్యంలో పాఠశాల 8వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జబర్దస్త్ కళాకారులు ఆనంద్, నాగిరెడ్డిలు చేసిన ప్రదర్శన ఆకట్టుకుంది.



వినుకొండ: పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు



నూజెండ్లలో జరిగిన పోటీల్లో వాలీబాల్ జట్టు విజేతలు

పంటలకు మద్దతు ధర చట్టం చేయాలి

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు

నరసరావుపేట టౌన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): దేశానికి ఆహార ధాన్యాలు పండించే రైతన్న పంటలకు మద్దతు ధర చట్టం చేయాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఢిల్లీ సరిహద్దులలో మద్దతు ధర చట్టం చేయాలని గత 50రోజులుగా అమరణ నిరాహార దీక్ష చేస్తున్న జగ్జీత్‌సింగ్ దలేవాల్‌కు మద్దతుగా మంగళవారం పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట పట్టణం గాంధీ పార్కు వద్ద ఏఐకేఎస్, రైతు సంఘం, సీపీఐ ఆధ్వర్యంలో సంఘీభావ దీక్ష చేశారు. ఈ సందర్భంగా ముప్పాళ్ళ నాగేశ్వరరావు మాట్లాడుతూ భారతదేశ రైతాంగానికి గిట్టుబాటు ధర కావాలని 2021లో 13 మాసాలు పాటు లక్షలాదిమంది రైతులు తీవ్రమైన పోరాటం చేశారన్నారు. కేంద్రం తెచ్చిన మూడు నల్ల చట్టాలను ఉపసంహరించుకుంటూ 2021 మార్చి 15న ప్రధాన మంత్రి దేశ ప్రజలకు హామీ ఇచ్చారన్నారు. ఈ నాలుగు సంవత్సరాల పాటు ప్రధాని నరేంద్రమోదీ రైతులను మోసగించారన్నారు. సంయుక్త కిసాన్‌మోర్చా నాయకుడు జగ్జీత్‌సింగ్ దలేవాల్ చేస్తున్న దీక్ష 50రోజులుగా 147 కోట్ల ప్రజలకు తిండిపెట్టే 15కోట్ల రైతు కుటుంబాల రక్షణ కోసం ఆమరణ దీక్ష చేస్తున్నాడన్నారు. వెంటనే కేంద్రప్రభుత్వం ఆర్డినేన్స్‌ను విడుదల చేయాలన్నారు. రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీపీ ప్రసాదు మాట్లాడుతూ జగ్జీత్ సింగ్ దలేవాల్ ఆమరణ దీక్ష చేస్తున్న కేంద్రప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఏ మారుతి వరప్రసాదు, సహాయ కార్యదర్శి కాసా రాంబాబు, సీ ప్రతాప్, ఆయా సంఘాల నాయకులు పాల్గొన్నారు.



సంఘీభావ దీక్షలో పాల్గొన్న ముప్పాళ్ళ నాగేశ్వరరావు, కేవీపీ ప్రసాదు తదితరులు

దొండపాడులో అంబేద్కర్ విగ్రహావిష్కరణ

వినుకొండ, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దొండపాడులో మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్మతోటి పౌలు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య ఆవిష్కరించారు. ముందుగా చెన్నయ్య రాకతో వినుకొండ నుంచి దొండపాడు వరకు మాల మహానాడు ఆధ్వర్యంలో బైక్, కార్లతో జైభీమ్ నినాదాలతో వీధులు హోరెత్తాయి. అనంతరం ఏర్పాటుచేసిన సభలో చెన్నయ్య మాట్లాడుతూ దళిత కుటుంబంలో జన్మించిన అంబేద్కర్ ప్రపంచంలోనే అత్యుత్తమ రాజ్యాంగాన్ని దేశానికి అందించారన్నారు. నేడు పాలకులు రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు డాక్టర్ మంచా నాగమల్లేశ్వరి, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుల వెంకటేశ్వర్లు, అంటరానితనం నిర్మూలన పోరాట సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ చార్వాక, ఉద్యమ సంఘం అధ్యక్షుడు టి.అశోకబాబు, రాష్ట్ర విభాగం అధ్యక్షురాలు మల్లెల అనిలతోపాటు జిల్లా నాయకులు కె.బాబురావు, కారంపూడి మైనర్‌బాబు, ప్రకాశ్, విగ్రహ నిర్మాణ నిర్వాహకులు ఎం.నాగమునయ్య, బి.రాజేష్, జి.రమేష్, బడుగు సాల్మన్, కొట్టెల కమలాకరరావు తదితరులు పాల్గొన్నారు.



విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న మాల మహానాడు నాయకులు

ప్రభుత్వ కార్యాలయంపై వైసీపీ జెండా

వినుకొండ, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకుపాలెం సర్పంచ్ కార్యాలయంపై వైసీపీ జెండా ఎగరవేయడం సర్వత్రా చర్చనీయాంశమైంది. గతంలో పాత సర్పంచ్ కార్యాలయాన్ని తొలగించి వైసీపీ హయాంలో నూతన కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. ఎన్నికల కోడ్‌తో కార్యాలయాన్ని ప్రారంభించకుండానే తాళాలు వేశారు. అయితే ఈ భవనంపై వైసీపీ జెండా ఏర్పాటు చేయడంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. కూటమి నాయకులు సైతం దీనిపై మౌనంగా ఉండటంపై పలు విమర్శలు వస్తున్నాయి. ఎన్డీఏ కూటమి అధికారంలో ఉన్నప్పటికీ జనసేన, టీడీపీ నాయకులకు పార్టీ పదవుల్లో గాని, అభివృద్ధి పనుల్లో గాని ప్రాధాన్యం దక్కడం లేదని జనసేన వర్గాల్లో తీవ్ర అసంతృప్తి నెలకొని ఉంది. దీంతో ఆ గ్రామంలోని యువత పార్టీ కార్యక్రమాలతోపాటు ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. దీంతో వైసీపీ పార్టీకి చెందిన కొందరు నేతలు ఏకంగా ప్రభుత్వ కార్యాలయంపై జెండా ఎగురవేశారు. దీనిపై అధికారులు కూడా పట్టనట్లు వ్యవహరించడంపై విమర్శలకు తావిస్తోంది.



ప్రభుత్వ కార్యాలయంపై ఏర్పాటు చేసిన వైసీపీ జెండా



జాతీయ స్థాయి కబడ్డీ పోటీలను తిలకిస్తున్న చీఫ్‌విప్ జీవీఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన తదితరులు, తలబడుతున్న కబడ్డీ క్రీడాకారులు

ఐక్యతకు నిదర్శనం గ్రామీణ క్రీడలు: చీఫ్‌విప్ జీవీ

ఈపూరు, జనవరి 15: (ఆంధ్రజ్యోతి) గ్రామీణ ప్రాంతాలలో క్రీడలను నిర్వహించడం వారి ఐక్యతకు నిదర్శనమని చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. మండలంలోని ముప్పాళ్ళలో జరుగుతున్న జాతీయస్థాయి కబడ్డీ పోటీలను నాలుగో రోజు బుధవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా 33 సంవత్సరాలుగా జాతీయ స్థాయిలో కబడ్డీ పోటీలు నిర్వహిస్తుండటంపై ముప్పాళ్ళకు గొప్ప పేరు ఉందన్నారు. పోటీలను మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు, సినీ హీరో రాజా, ఆర్.జగ్గారావు, వి.హనుమయ్య, ఎం.నరసింహారావు, పి.నాగేశ్వరరావు, ఎ.కోటేశ్వరరావు, టి.బాలయ్య, నర్రా కిశోర్, పి.వెంకట్రావు, పి.చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



జిల్లా ఎస్పీ నుంచి అవార్డు అందుకుంటున్న అర్బన్ సీఐ పి.రమేష్, రూరల్ సీఐ బి.సుబ్బనాయుడు

అర్బన్, రూరల్ సీఐలకు ఉత్తమ సేవా పురస్కారాలు

చిలకలూరిపేట, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు అత్యుత్తమ సేవలను అందించినందుకుగాను చిలకలూరిపేట అర్బన్, రూరల్ సీఐలు పి.రమేష్, బి.సుబ్బనాయుడులకు పల్నాడు జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు ఉత్తమ సేవా పురస్కారాలు అందచేశారు. సంక్రాంతి సందర్భంగా నరసరావుపేటలో జరిగిన కార్యక్రమంలో ఈ పురస్కారాలను అందజేశారు. చిలకలూరిపేట అర్బన్ పోలీస్ స్టేషన్‌ను జిల్లాలోనే బెస్ట్ పోలీస్ స్టేషన్‌గా రూపొందించి పనితీరు, సామర్థం తదితర అంశాలను పరిగణలోకి తీసుకొని పి.రమేష్‌కు, నేరం జరిగిన వెంటనే అనేక కేసులలో చురుకైన దర్యాప్తు నిర్వహించి, దోషులను పట్టుకోవడంతో పాటు, బాధితులకు సొమ్ము రికవరీ చేయడంలోనూ సుబ్బానాయుడు ముందంజలో ఉన్నట్టు గుర్తించి ఉత్తమ ఇన్వెస్టిగేషన్ అధికారిగా బి సుబ్బనాయుడుకు బెస్ట్ ఇన్వెస్టిగేషన్ అధికారిగా అవార్డు బహూకరించారు. చిలకలూరిపేట రూరల్ ఎస్ఐ జి.అనిల్‌కుమార్ ఉత్తమ ఎస్ఐగా అవార్డు అందుకున్నారు. బెస్ట్ హోమ్‌గార్డుగా అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్ఐగా పని చేస్తున్న జీవీ సుబ్బారావు, హోమ్ గార్డుగా ఉన్న ఎండీ ఇబ్రహీంలు కూడా పురస్కారాలు అందుకున్నారు.



లెఫ్టినెంట్ కల్నల్ సాంబశివరావును సత్కరిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

లెఫ్టినెంట్ కల్నల్‌కు సత్కారం

జగ్గాపురం (యడ్లపాడు), జనవరి 15 (ఆంధ్రజ్యోతి): దేశ రక్షణలో ప్రాణాలకు తెగించి పోరాడుతున్న ఆర్మీ జవానులకు సాటి మరొకరు లేరని లెఫ్టినెంట్ కల్నల్ ముద్దన సాంబశివరావు అన్నారు. సంక్రాంతి పండుగకు స్వగ్రామమైన జగ్గాపురం గ్రామానికి కుటుంబ సభ్యులతో కలసి వచ్చారు. ఇండియన్ ఆర్మీడేను పురస్కరించుకుని రోటరీ క్లబ్ చిలకలూరిపేట సభ్యులు ఆయనను ఘనంగా సత్కరించారు. బుధవారం క్లబ్ సభ్యులు జగ్గాపురంలోని ఆయన నివాసానికి చేరుకుని శాలువా, పుష్పగుచ్ఛాన్ని అందించి సన్మానించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు ఆళ్ళ వేమనరెడ్డి మాట్లాడుతూ దేశాన్ని కాపాడే జవాన్లకు ప్రజలంతా గౌరవం ఇవ్వాలన్నారు. అలాగే అన్నం పెట్టే రైతన్నకు కూడా గౌరవం ఇవ్వాలన్నారు. జైజవాన్, జైకిసాన్ అన్న నినాదంతో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి ఉప్పుటూరి ప్రసాదు, క్లబ్ మాజీ అధ్యక్షుడు తోటకూర వెంకటనారాయణ, సభ్యులు గళ్ళా సాంబశివరావు, చిలుకూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



తూబాడులో దివ్య పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఫాదర్లు

వైభవంగా పునీత వన చిన్నప్ప దేవాలయ చర్చి తిరునాళ్ళ

నాదెండ్ల, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూబాడులోని పునీత వన చిన్నప్ప చర్చి తిరునాళ్ళను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం ఫాదర్ పెంటారెడ్డి రాజారెడ్డి ఆధ్వర్యంలో దివ్య పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఫాదర్ ఇన్నారెడ్డి మాట్లాడుతూ పునీత వనచిన్నప్ప జీవితం ఆదర్శనీయమన్నారు. తూబాడుతో పాటు పలు గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులు చర్చిలో కొవ్వొత్తులు అందజేశారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. బాణసంచా పేలుస్తూ, భక్తి గీతాలను ఆలపిస్తూ తేరులో వన చిన్నప్ప, మరియమ్మ దేవతామూర్తుల విగ్రహాలను గ్రామంలో ఊరేగించారు. ఫాదర్ లూర్దుమర్రెడ్డి ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. చిలకలూరిపేట రూరల్ సీఐ సుబ్బనాయుడు, ఎస్ఐ పుల్లారావులు పోలీసు బందోబస్తు నిర్వహించారు.

అభయాంజనేయ స్వామికి కిరీటం బహూకరణ

నరసరావుపేట రూరల్, జనవరి 15: (ఆంధ్రజ్యోతి), పట్టణంలోని అభయాంజనేయ స్వామి ఆలయంలో స్వామి వారికి వెండి కిరీటంను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు చేతుల మీదుగా అందజేశారు. టీడీపీ నాయకులు కోవూరు బాబు ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో నరసరావుపేట నియోజక వర్గంలో కూటమి అభ్యర్థిగా పోటీచేసిన డాక్టర్ చదలవాడ అరవిందబాబు అత్యధిక మెజారిటీతో గెలవాలని కోవూరు బాబు అభయాంజనేయ స్వామి ఆలయంలో మొక్కుకున్నారు. డాక్టర్ చదలవాడ అరవిందబాబు ఎమ్మెల్యేగా గెలిచిన నేపథ్యంలో సంక్రాంతి పండుగ సందర్భంగా స్వామి వారికి వెండి కిరీటం మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



ఆలయంలో వెండి కిరీటం అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు, కోవూరు బాబు, కూటమి నాయకులు